ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 | సంచిక : 3 | నవంబర్ 2020

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 24
గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

03-11-1985, జిన్నూరు
అరుణాచల మహత్యం
శ్రీమద్భగవద్గీత

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 03 నవంబర్ 1985, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

కృష్ణస్వామి గారు మొట్టమొదట ఆశ్రమానికి వచ్చినప్పుడు తలకింద దిండు లేకపోతే ఆయనకు నిద్ర పట్టేది కాదు. ఇంటి దగ్గర తలకింద దిండు పెట్టుకుని పడుకోవడం అలవాటు అయిపోయి, తలకింద దిండు లేకపోతే నిద్ర పట్టేది కాదు. ఆకులు, పుల్లలు తలకింద దిండుగా పెట్టుకుని పడుకునేవారు. అక్కడ ఉన్నవారితో భగవాన్ "ఏమండీ అతనికి తలకింద దిండు అలవాటు, దిండు లేకపోతే అతనికి నిద్ర పట్టదు. ఒక దిండు చూసి ఈ కృష్ణయ్య తలకింద పెట్టండి" అని చెప్పారట. భగవాన్ విరూపాక్షగుహలో ఉండగా, ఆ విరూపాక్షగుహ గురించి కోర్టులో చర్చలు జరుగుతున్నాయి. విరూపాక్ష దేవర అనేవారి సమాధి విరూపాక్షగుహలో ఉంది. సరే కోర్టులో ఒకరు నెగ్గారు, అతను ఏమి చేశాడు అంటే దారిలో నిలబడి గుహని చూడటానికి వెళ్ళేవారు అందరి దగ్గర భగవాన్ని ఎవరైతే చూడటానికి వెళ్ళాలి అనుకుంటున్నారో వాళ్ళ అందరి దగ్గర డబ్బులు పుచ్చుకునేవాడంట. అతని ఉద్దేశం ఏమిటంటే, విరూపాక్షగుహలో భగవాన్ ఉంటారు. ఈ వచ్చే జనం అందరూ కూడా విరూపాక్షగుహని చూడటానికే వస్తున్నారు అని, ఈ గుహ మన తరపున కోర్టులో వచ్చింది కదా, ఈ గుహ పేరు చెప్పి మనం డబ్బులు సంపాదించుకుందాం అని అతని ఉద్దేశం. అంటే కోర్టులో మనం నెగ్గాం కదా అని. అతనికి కబురు పంపించి, ఇక్కడకు నన్ను చూడటానికి వచ్చే వాళ్ళ దగ్గర డబ్బు వసూలు చెయ్యకు అని భగవాన్ చెప్పారు. అతని ఉద్దేశం ఏమిటి? గుహ మనది కదా అని. భగవాన్ చెప్పినా అతడు మానలేదు. జనం వస్తున్నారు. ఒకనాడు

భగవాన్ ఏమి చేశారంటే, ఆ గుహని విడిచిపెట్టి బయటకి ఇంకో గుహలోకి వెళ్ళిపోయారు. ఇక గుహ చూడటానికి ఎవరు వస్తారు? డబ్బు పెట్టి కొనుక్కుని వెళ్ళవలసిన పని ఏమిటి అని జనం మొత్తానికి వెళ్ళటం మానేశారు. మనకు ఎలాగో ఆదాయం రావటం లేదు అనిపించి అతడు భగవాన్ దగ్గరకు వెళ్లి "నేను డబ్బు వసూలు చెయ్యనండి, అందుచేత మీరు పూర్వం ఎలా ఇక్కడ గుహలో ఉంటున్నారో ఇప్పుడు అలానే ఉండండి" అని చెప్పాడు.

లోకంలో ఏదో పని చేసుకుంటున్నాం అనుకోండి, ఎవరితోనో మాట్లాడుతున్నాం అనుకోండి, స్నేహాలు చేస్తున్నాం, విరోధాలు చేస్తున్నాం అనుకోండి. లోకానికి, మనకు సంబంధం ఏమిటి? మనం దేహంతోటి, మనసు తోటి సంబంధం పెట్టుకుంటున్నాం. కాని భగవంతుడు ఏమనిచెబుతున్నాడు? మనం ఆత్మ అంటున్నాడు. ప్రపంచం అంటే ఏమిటి? కళ్ళతోటి చూస్తున్నాం, చెవులతోటి వింటున్నాం, ఇదే ప్రపంచం. ఈ లోకాన్ని మనం ఎంజాయ్ చెయ్యాలి, ఈ లోకాన్ని భోగించాలి అనే సంస్కారం మన హృదయంలో ఉన్నంతకాలం మనకుదేహం వస్తూనే ఉంటుంది. చాలామంది అంటూ ఉంటారు. మా మనస్సు కుదురుగా లేదండి, మా మనసు శాంతిగా లేదు ఏమి చెయ్యమంటారు అని? భగవాన్ చెబుతున్నారు మీ మనసు కుదురుగా లేదు అనుకోండి, మీ మనసు శాంతిగా లేదు అనుకోండి, మీకు నష్టం ఏమిటి? అది మీరు కాదు కదా. నా మనస్సు కుదురుగా లేదు, మీకు ఏమైనా దుఃఖం వస్తుందా పోనీ, ఎందుచేత? నేను మీరు కాదు కాబట్టి మీకు దుఃఖం రాదు. నేను ఏ విధంగా అయితే మీరు కాదో, అలాగే మీ మనస్సు కూడా మీరు కాదు. నా మనసుకు ఏకాగ్రత రావటం లేదు అని చాలామంది అంటారు. అది మీరు కాదు అన్నప్పుడు ఇంక ఏకాగ్రత ఏమిటి మీకు? సత్యం వైపుకి అది ఎంతవరకు మళ్ళుతోంది? ఆత్మ వైపుకి, సత్యం వైపుకి లోపలకి ఎంతవరకు ఆ మార్గంలోకి అది ప్రయాణం చేస్తోంది, అది చూసుకోవాలి. హింసా విధానం పనికిరాదు. అనవసరపు మాటలు మాట్లాడకూడదు. జాగ్రత్తగా మాట్లాడాలి, సాధ్యమైనంతవరకూ అణకువగా ఉండాలి. ప్రతీ సెకను సద్వినియోగం చేసుకోవాలి, పాడుచేసుకోకూడదు. ఇష్ట అయిష్టాలు తగ్గించుకోవాలి. ఇవన్నీ గీతలో చెప్పారు, ఉపనిషత్ లలో చెప్పారు, పెద్దలు అందరూ చెప్పారు. దీనివల్ల మనకు ఏమిటి ఉపకారం? దీనివల్ల ఏమిటి ప్రయోజనం? మీరు విషయాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించండి. ఏమీ ప్రయోజనం లేకపోతే భగవంతుడు ఎందుకు చెబుతాడు. భగవంతుడు చెప్పినట్లుగా జీవిస్తే మీ మనస్సు ఆత్మాకారం చెందుతుంది. రాగద్వేషాలు తగ్గించుకుంటే, హింసా విధానం తగ్గించుకుంటే మీ మనస్సు మీకు తెలియకుండా ఆత్మాకారం చెందుతుంది. మీ ప్రయత్నం లేకుండా, మీ సాధన అక్కర లేకుండానే మనస్సు మీకు స్వాధీనంలోకి వచ్చేస్తుంది. మీరు పూజ చేస్తున్నారు, జపం చేస్తున్నారు ఈశ్వరుడి ప్రీతి కోసం ఇవన్నీ చేస్తున్నారు అనుకోండి.

అప్పుడు రెండు లాభాలు మీకు. మీకున్న కోరికా నెరవేరుతుంది. మీ మనస్సు పవిత్రమై ఆత్మాకారం చెందుతుంది. ఏమీ కష్టపడనక్కరలేదు. భగవంతుడు చెప్పినట్టుగా చేస్తే చాలు. భగవంతుడు చెప్పినట్లుగా కనుక మనం నడుచుకుంటే మన సాధన తోటి, మన కష్టం తోటి సంబంధం లేకుండా మనస్సు తన స్వస్థానంలోకి వెళ్ళిపోతుంది. విషయాన్ని మీరు అర్థం చేసుకుంటే మీరు చేసే సాధన సరిపోతుంది. ఎదుటి వాళ్ళు మన గురించి చెప్పుకోవాలి అని కాని,మనకు కీర్తి రావాలి అని కాని,మనకు గొప్పలు రావాలి అని కాని, ఇటువంటి మాటలు మీరు వదిలేసి, మీరు మామూలుగా చేసే పనులు ఈశ్వరుడి ప్రీతి కోసం చేస్తే ఈ లోకంలో ఉండగానే,ఈ శరీరం ఉండగానే జ్ఞానులు అయిపోతారు. ఈ ప్రపంచంలో ఏదైనా సరే మనకు యదార్థంగా కనిపిస్తోంది అంటే, మన మనసుని బయటకి ఆకర్షిస్తోంది అంటే, అది ఒక వస్తువు అవ్వనివ్వండి, ఒక రూపం అవ్వనివ్వండి, ఏదైనా సరే ఆకర్షిస్తోంది అంటే, దానికి కారణం ఏమిటి? అంటే అక్కడ నిజం ఉందని కాదు. మనసులో వాసన ఉండి ఆకర్షిస్తుంది. మనకు అరుణాచలం వెళ్ళాలి, కాశీ వెళ్ళాలి, రామేశ్వరం వెళ్ళాలి ఇటువంటి భావాలు వస్తున్నాయి అనుకోండి, మనకు దేహదృష్టి ఉన్నట్టు లెక్క. వెళ్ళడం మంచిదే నేను వెళ్ళవద్దు అనటం లేదు. అది కూడా దేహదృష్టే. ఒకరు భగవాన్‌ని గురువు అవసరమా మనిషికి అని అడిగారు? అవసరమే అన్నారు భగవాన్. మళ్ళీ వెంటనే ప్రశ్న, అయితే మీకెందుకు గురువు లేరు? ముందే మీకు ఎందుకు గురువు లేడు అని అడగవచ్చు కదా. మీరేమి తెలివి తక్కువ వాళ్లా అండి. లౌకికులు కూడా బ్రహ్మాండమైన తెలివైన వాళ్ళు. నాకు గురువు లేరు అని నువ్వు చెప్పేస్తున్నావు ఏమిటి? నాకు లేరని నీకు ఎలా తెలుసు? అయితే మీరు ఎవరి దగ్గర మంత్రం పుచ్చుకున్నట్టు కనిపించలేదే, చరిత్రలో ఎక్కడా లేదే, చరిత్రలో లేకపోవచ్చు. గురువు అనేవారు ఒక రూపంలో ఉండకపోవచ్చు. మానవరూపంలోనే గురువు ఉండాలని ఏమీ లేదు. ఒక మనిషే గురువు అయ్యి ఉండక్కరలేదు. నేను ఒక చోట మంత్రం పుచ్చుకోక పోవచ్చు. నాకు గురువు ఉన్నాడు ఒకడు. ఎవడు? నాలోని ఆత్మే నా గురువు. నాలోని భగవంతుడే నాకు గురువు. వాడే నాకు తెలియబడ్డాడు. వాడే నాకు తెలియబడ్డప్పుడు వాడు నాకు గురువే. గురువు కాకపోతే నాకు ఎలా తెలియబడతాడు? భగవంతుడు చెప్పే మాటల మీద మీకు చలనం లేని విశ్వాసం మీ హృదయంలో కలుగుతుంటే, దేవుడి కృప మీ మీద ఉన్నట్టే. భగవంతుని కృప గనుక మీకు లేకపోతే ఆయన వాక్యం మీద మీకు విశ్వాసం కలుగనే కలగదు. నీకు విశ్వాసం లోపల ఎంత తీవ్రంగా పెరుగుతుందో అంత కృప నీ శిరస్సు మీద ఉన్నట్టు. భగవంతుడు చెప్పే మాటల మీద ఎంతవరకు నీకు విశ్వాసం కలుగుతుందో, అంతవరకూ దేవుడి యొక్క కృప నీ మీద ఉన్నట్టే. మీకు ఏమైనా సహాయం చెయ్యాలి అనుకోండి, భగవంతుడు

స్వయంగా రూపం ధరించి మీ ఇంటికి రావక్కరలేదు. ఎవరో ఒకరి ద్వారా మీకు ఆ సహాయం చేయించి, ఆ పని పూర్తి చేస్తాడు.అంతేగాని భగవంతుడు అవతరించి మీ దగ్గరకు రానక్కరలేదు. ఎవరో ఒకరి ద్వారా మీకు ఆ మంచి మాట చెప్పిస్తాడు. ఆ పని పూర్తి చేయిస్తాడు. మీకు సందేహాలు ఎక్కువ వస్తాయి అనుకోండి మీకు శరణాగతి లేనట్టే. ఈశ్వరుడి యొక్క అస్తిత్వం మీద మీకు విశ్వాసం లేనట్టే. జ్ఞాని సంకల్పించడు. సంకల్పిస్తే జ్ఞాని ఎలా అవుతాడు. ఆయన సంకల్పించక్కరలేదు. జ్ఞాని యొక్క సన్నిధి సరిపోతుంది. మీ ద్వారా మాకు ఈ ఉపకారం జరిగింది అని భగవాన్‌తో ఎవరైనా చెబితే "నాకు ఏమి తెలుసు. మీకు జరగవలసి ఉంది అది జరిగింది. నాకు ఏమి తెలుసు" అనేవారు. రమణస్వామి ఇప్పడు లేరు అని అందరూ అనుకుంటాము. రమణస్వామి దేహం ఇప్పడు లేదు, రమణస్వామి అంటే ఆ దేహమా? కాదు ఆత్మ. ఆత్మ ఎప్పుడూ ఉంది కదా, పూర్వం ఉంది, ఇపుడు ఉంది,ఎప్పుడూ ఉంటుంది. ఆయన ఆత్మ కాబట్టి ఎప్పుడూ ఉంటుంది. ఆత్మ లేని కాలం లేదు, ఆత్మ లేని చోటు లేదు. మనందరి ఉద్దేశం ఏమిటి? రమణ స్వామి ఇప్పుడు లేరు అనుకుంటాం. ఆయన దేహంతో ఉన్నపుడు మటుకు ఆ దేహం మనలని ప్రేమించిందా, దేహం మనలని అనుగ్రహించిందా? లేదు. ఎదుటి వ్యక్తి మీద కాని, సమాజం మీద కాని మీకు ద్వేషం కలుగుతోంది అనుకోండి, ప్రేమ తప్పించి ఏ విధమైన భావన అయినా మీకు కలుగుతుంటే, మనకు జ్ఞానం లేనట్టే.

భగవాన్ చివరి రోజులలో ఆయన శరీరం బాగా వడిలిపోయింది. దగ్గర ఉన్న వాళ్ళు రాత్రుళ్లు భగవాన్‌ని ఏదోఒకటి అడుగుతూ ఉండేవారు, సర్వాధికారి వారితో "మీరు సాయంత్రం సరిగ్గా తొమ్మిది అయ్యే సరికి భగవాన్‌ని ఏమి పలకరించకండి, ఆయనకి ఆరోగ్యం ఏమీ బాగాలేదు. మీరు పడుకోండి, భగవాన్ ఏమైనా చెబుతాను అంటారు అనుకోండి 'మాకు నిద్ర వస్తోంది స్వామి!' అని వెళ్లి పడుకోండి" అని చెప్పాడు. అయితే మనలాగా ఎక్కువ కష్ట పడక్కరలేదు భగవాన్, భగవాన్ ఉరికే ఇప్పుడు భగవద్గీత ఉంది అనుకోండి అలా చూశారు అనుకోండి, అద్దంలో మన మొఖం చూసుకుంటే ఎలా ఉంటుందో, ఆ వాక్యం చూసేటప్పటికి అందులో నిజం అలా కనపడుతూ ఉంటుంది భగవాన్‌కి. కారణం ఏమిటి? సత్యం ఆయనకు అనుభవంలో ఉంది కాబట్టి, పుస్తకం తీసి చూసేటప్పటికి అర్థం తెలుస్తూ ఉంటుంది. అందులో సత్యం ఏమిటో బోధపడుతుంది. ఎందుచేత ఆ వస్తువు తానే అయ్యి ఉన్నాడు కాబట్టి. సర్వాధికారి అలా చెప్పి, ఏమి చేసేవాడు అంటే, వీళ్ళు రాత్రి పది గంటలకి ఒకవేళ భగవాన్‌ని డిస్టబ్ చేస్తున్నారా అని వెయిటింగ్ హాలులోని ఆ కిటికీ లోంచి చూసేవాడట. మనలా మంచం మీద ఎప్పుడూ భగవాన్ పడుకోలేదు జీవితంలో. వీళ్ళు ఏదో అడుగుతూ ఉండేవారు. ఈ సర్వాధికారి రాత్రి తొమ్మిది గంటలకి,

పది గంటలకి కిటికీలోంచి చూసేవాడు. సర్వాధికారి ఇలా ఆర్డర్ వేశాడు అని భగవాన్‌కి తెలుసు. కిటికీలోంచి చూసి వెళ్ళిపోతాడు కదా, వెళ్ళిపోయిన తరువాత మళ్ళీ మామూలే. ఆ సర్వాధికారిని చూస్తే వీళ్ళు పడుకునేవారు. వాడు కిటికీలోంచి చూస్తున్నాడు అని వీళ్ళకి తెలియదు. భగవాన్ చూసేవారు, భగవాన్ చూసి పడుకోమనేవారు అంట. పడుకో అంటే అప్పుడు ఇలా నిద్రపోయినట్టు నటించేవారు అట. అతను చూసి వెళ్ళిపోయిన తరువాత మళ్ళీ లెమ్మని చెప్పేవారట. అప్పుడు వీళ్ళు భగవాన్‌ని స్వామి ఎందుకు అలా చేయటం? దేహం బాగా కృశించిపోయింది కదా స్వామి ఏమి చెప్పొద్దు అని ఏదో అనేవారంట. అప్పుడు భగవాన్ మీరు నాకు అన్నం పెడుతున్నారు కదా, మజ్జిగ అన్నమో, ఏదోకటి తింటున్నాను కదా, మరి మజ్జిగ అన్నమో, గంజి అన్నమో ఏదోకటి తింటుంది కదా ఈ దేహం. ఏదో నాలుగు మాటలు చెప్పటానికి కూడా పనికిరాని ఈ దేహానికి మజ్జిగ అన్నం కూడా ఎందుకు అన్నారు. వెంకటరత్నం గారు అని ఒకాయన ఉన్నారు. చివరి రోజుల్లో భగవాన్‌కి మోకాళ్ల నొప్పి వస్తే ఆయింట్‌మెంట్ రాసి రుద్దమని ఎవరో డాక్టరు గారు చెప్పారు. భగవాన్ ఏదో కథ చెబుతున్నారు. కథ వింటూ ఏకంగా, బలవంతంగా ఎక్కువసేపు రుద్దేశారు అంటండి. అది వెలుగు వచ్చేటప్పటికి ఏకంగా బొబ్బర కింద తేలిపోయింది. మరుసటి రోజు నుంచి భగవాన్‌కి మొఖం చూపించడానికి సిగ్గు వేసి రెండు రోజులు దూరంగా తప్పుకున్నారు వెంకటరత్నంగారు. అప్పుడు మూడో రోజున భగవాన్ వెంకటరత్నం గారికి కబురు పంపించారు. వెంకటరత్నం గారితో భగవాన్ "ఏమయ్యా నువ్వు అంత సిగ్గు పడక్కరలేదు. బాధ పడక్కరలేదు. నీ స్థానంలో నేను ఉన్నాను అనుకో, నేను చేసేది కూడా అంతే. ఎవరో ఏంటి నీ స్థానంలో ఎవడు ఉన్నా ఆ పనే చేస్తాడు. అందుచేత నువ్వు సిగ్గు పడక్కరలేదు" అని చెప్పారు. మనకు సైన్స్ ఏమి చెబుతోంది అంటే, సూర్యుడి యొక్క కాంతి, చంద్రుడి ద్వారా మనకు వెన్నెలగా వస్తుంది. వెన్నెలగా వచ్చేది కూడా సూర్యుడి కాంతే. భగవాన్ ఏమి చెప్పారు అంటే మనసుకు కూడా శక్తి ఆత్మ లోంచే వస్తుంది. ఆత్మ యొక్క వెలుగు మీ మనసులో పడుతుంటే, ఆ వెలుగే ఇంద్రియాల ద్వారా బయటకి వెళ్లి లోకంలో విషయాలను గ్రహిస్తుంది. వెలుగు ఆత్మదే, ప్రకాశం ఆత్మదే. శరీరం జడం మనసు జడం. ఇవన్నీ జఢ వస్తువులే.

మనస్సు నీ ఇంద్రియాల ద్వారా బయటకి వెళ్ళిపోయి పనిచేస్తుంది. మళ్ళీ లోకంలో జరిగే సంఘటనలు, లోకంలో జరిగే విషయాలను గ్రహించేది కూడా మనస్సే. అలా గ్రహించి ఏమి చేస్తుంది? లోపల జాగ్రత్త పెట్టుకుంటుంది.అలా జాగ్రత్త పెట్టుకుని కొత్త జన్మ వచ్చినప్పుడు ఈ మనసులోని విషయాలే ఇంద్రియాల ద్వారా బయటకి వస్తాయి. మీకు మనస్సు కనుక కదలకపోతే లోకం లేదు. మనస్సుకి అంత ప్రాముఖ్యత ఉండగా, మనం శరీరానికి ఇచ్చే

ప్రాముఖ్యత కూడా మనస్సుకి ఇవ్వడం లేదు. లోపల ఉన్న సత్యాన్ని ఒక్కసారి మనసు రుచి చూసింది అనుకోండి, ఇక విడిచి పెట్టదు. అది అంతర్ముఖం అవుతూనే ఉంటుంది. ఒక్కసారి ఆత్మ దర్శనం అయితే ఇక అజ్ఞానంలోకి పునరావృత్తి ఉండదు. మనకు చాలా ఇష్టం అయిన వాళ్ళు కూడా ఈ శరీరం శవం అయిపోయిన తరువాత మనల్ని చూసి అసహ్యించుకుని దీనిని వల్లకాటిలోకి ఎప్పుడు తీసుకుపోతారా అని చూస్తారు. అది వాళు ళ ప్రేమించిన శరీరమే కదా, వాళ్ళు ఇష్టపడ్డ శరీరమే కదా. మరి ఆ శరీరాన్ని చూసి ఎందుకు అసహ్యించుకుంటున్నారు? కళ్ళు అక్కడే ఉన్నాయి. ముక్కు అక్కడే ఉంది. అవయవాలు అన్నీ అక్కడే ఉన్నాయి కదా,ఒక విషయం మటుకు మీరు హృదయంలో గాఢంగా హత్తుకునేలా చూసుకోండి. ఈమనస్సు యొక్క విజృంభణ,ఎక్కడినుంచి అయితే మనసు విజృంభిస్తుందో, ఈ తలంపులు ఎక్కడినుంచి అయితే వస్తున్నాయో, ఆ తలంపులు పుట్టుక యొక్క చోటు కనుక మనం శరీరం పడిపోక ముందే చూడలేకపోతే, మనం వైకుంఠానికి వెళ్ళినా, కైలాసానికి వెళ్ళినా, ఏమీ సుఖం లేదు. బాగా గుర్తుంచుకోండి. మీరు అందరూ పుణ్యాలు చేసుకోవచ్చు. మీ పుణ్యఫలితంగా మీరు వైకుంఠానికి వెళ్లొచ్చు. అక్కడ కొంతకాలం ఉండవచ్చు. మనం పాలకొల్లులో బయలుదేరాం, భీమవరానికి టిక్కెట్టు తీసుకున్నాం. పాలకొల్లు తరువాత లంకలకోడేరు వస్తుంది. లంకలకోడేరు స్టేషన్ చాలా బాగుంది రెండు గంటలు ఆపుచెయ్యండి అంటే రైలు ఆపుచేస్తారా అండి. మన ప్రయాణం కూడా అంతే, ఇది స్టేషనే. మన ప్రయాణంలో జిన్నూరు స్టేషన్‌లో పడ్డాం. ఇక్కడ చాలా సుఖంగా ఉందండి. జిన్నూరులో మాకు రోజులు బాగానే వెళ్లిపోతున్నాయి ఆపు చేయండి అంటే ఆపు చెయ్యడు. రైలు ఆగిపోతోందా నీ గురించి. అలాగే Life is endless. తత్వం అర్థమయ్యేవరకూ నీకు ఇలా జీవితాలు వస్తూనే ఉంటాయి. మీరు పుణ్యాలు చేసి వైకుంఠానికి వెళితే, వైకుంఠంలో బ్రహ్మాండంగా ఉంటుంది. వైకుంఠంలో మీరు పని చెయ్యక్కరలేదు. పని చెయ్యక్కరలేకుండా అన్ని భోగాలు ఉంటాయి. నీకు ఇంక ఏమి కావాలి? చాలా బాగుంటుంది. కానీ అది ఎంతకాలం? అది నిజం కాదు కదా, దానికి టైము ఉంటుంది తరువాత కిందికి గెంటేస్తారు. లౌకికపద్ధతి ప్రకారం జీవితంలో మనం ఎదుటి మనిషిని మోసం చేసినట్టుగా, ఈశ్వరుడిని కూడా మోసం చేస్తే మోక్షం వస్తుంది అనుకుంటున్నారు అలా రాదు. డాక్టర్ చదివే కోర్సుల్లో ఏమి చెబుతారు అంటే ఈ హ్యూమన్ బాడికి సెంటర్ అంతా కూడా మెదడు అని, మెదడు సుప్రీమ్ అని, అక్కడ నుంచే మొత్తం ఆర్డర్స్ అన్నీ వస్తున్నాయి అని, మైండ్ కి ప్లేస్ కూడా ఇదే అని చెపుతారు. అంటే మెదడు దగ్గర నుంచి ఆర్డర్స్ వస్తున్నాయి, అంతవరకూ రైటే. ఏవండీ, మెదడు పని చేయనప్పుడు కూడా, మనస్సు పని చేయనప్పుడు కూడా, నిద్రలో మనస్సు ఏమైనా పని చేస్తుందా మనకు ? ఏమీ పని

చెయ్యదు. మరి గుండె ఎలా కొట్టుకుంటుంది ? సైన్స్ ప్రకారం మైండ్‌కి సీటు మెదడు. భగవాన్ ఏమి చెప్పారు అంటే "విజృంభించడం అంటే మెదడులో విజృంభిస్తుంది, అది కరక్టే కాని దాని మూలం మటుకు అక్కడ లేదు. హృదయంలో ఉంది. దానికి మూలమే గనుక మెదడు అయితే రాత్రుళ్లు మీకు ఎవరికి నిద్ర ఉండదు. ఎందుచేత రాత్రి గాఢ నిద్రలో మెదడులోంచి, నీ మనస్సు హృదయంలోకి దాని పుట్టింటికి ఉపసంహరించు కుంటుంది కాబట్టి నీకు నిద్ర పడుతుంది. హృదయంలో మనస్సు సూక్ష్మరూపంలో, బీజ రూపంలో ఉంటుంది. మనస్సు లోపలకి ఉపసంహరించుకుని, ఉపసంహరించుకుని అంటే మనస్సు పల్చబడి, సున్నితమై, సూక్ష్మమై ఇప్పుడు మనం దారాన్ని తీసుకెళ్లి సూది బొర్రులోంచి దారాన్ని గుచ్చుతున్నాం. ఆ దారం కొంచెం పోగు పడింది అనుకోండి ఇక ఆ సూదిలోకి వెళ్లదండి. అదే విధంగా మన మనస్సు పోగులు, పోగులుగా ఉంటే అది హృదయాకారం చెందదు. మనస్సు సూక్ష్మం అయ్యి, ఆ దారం ఎంత సూక్ష్మంగా ఉందో మనస్సు అంత సూక్ష్మం అయ్యి,అందులో ఏమి కల్మషం కనుక లేకుండా ఉంటే అది ఏమవుతుంది అంటే హృదయాకారం చెందుతుంది. మనసులోని ముడులు అన్నీ విప్పేస్తే, కిందికి రాలిపోతే అది సహజంగా హృదయాకారం చెందుతుంది. మనసు సున్నితమై, ప్రశాంతమై, దానికి ఒక కుదురు ఏర్పడుతుంది. అప్పుడు హృదయాకారం చెందుతుంది. అంటే హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మని ఎప్పుడైతే మనం తెలుసుకున్నామో అప్పుడు దాని ఆకారం పొందుతాము. ఆత్మని తెలుసుకోవటం అంటే ఆత్మ అవ్వటమే. అంతవరకూ, అది గ్రహించనంత కాలం వైకుంఠానికి వెళ్లినా, కైలాసానికి వెళ్లినా, ఏ మతంలో పుట్టినా మనకు ప్రయాణం ఆగదు. శవాలను మోస్తూ ఉండాల్సిందే.

లోకాలు లేవు అనుకోకండి, లోకాలు ఉన్నాయి. కాని అవి కూడా ఈ లోకాలు ఎంత అసత్యమో,ఆ లోకాలు కూడా అంతే అసత్యం. మరి వైరాగ్యం ఉన్న వాళ్లకి ఏమి వస్తుంది అని వేళాకోళం కోసం మీరు అడగవచ్చు, నిజమైన వైరాగ్యం గనుక ఉంటే తప్పనిసరిగా జ్ఞానం వస్తుంది. అంతకు మించినది ఏమి ఉంది అసలు. జ్ఞానం కంటే గొప్పదే కాదు జ్ఞానం తో సమానం అయినది కూడా ఈ సృష్టిలో ఏది లేదు. ఈ లోకంలోనే కాదు ఇతర లోకాల్లో కూడా ఏమి లేదు. భగవంతుడు చెప్పిన మాటలు నిజం. మనం ఏమి అనుకుంటున్నాం, కొంతమంది పెద్దవాళ్లం, కొంతమంది చిన్నవాళ్లం అనుకుంటున్నాం. ఏమి పెద్దరికం? ఏమి చిన్నరికం? ఈ దేహాలలో కొంతమంది పెద్దవాళ్లు, కొంతమంది చిన్నవాళ్లు. ఇవన్నీ నిజం ఏమిటండీ. కొంతమందికి చిన్నతనంలో జ్ఞానం కలుగుతుంది. ఆ దేహంలోనే కలిగిందా అదంతా, అంతకుముందు ఎన్ని దేహాలలో వాడు సాధనచేసి వచ్చాడో, భగవాన్‌కి పదహారో సంవత్సరంలో జ్ఞానం కలిగింది, అంటే ఆ దేహంలో ఉండగా

పదహారో సంవత్సరంలో కలిగింది, అంతకుముందు దేహం లేదనా? ఆ దేహంలో ఉండగా పదహారో సంవత్సరం కాబట్టి పదహారో సంవత్సరంలో కలిగింది అని చెపుతున్నారు. మనకు జ్ఞానం కలగటం కోసం అందరు దేవతల అనుగ్రహం అక్కర్లేదు మనకు, ఒక్క దేవత యొక్క అనుగ్రహం చాలు. భగవాన్ చెప్పింది ఏమిటంటే ఈ నేను అనే తలంపు యొక్క మూలాన్ని అన్వేషించండి ఇంక ఏమి చేయక్కరలేదు చాలు అన్నారు. మనం అందరం నేను నేను అంటున్నాం కానీ, ఈ నేను నిజమైన నేను కాదు ఇది అబద్ధమైన నేను. ఈ నేను కనుక నిజమైతేమనకు దుఃఖం ఎందుకు వస్తుంది? మనం అందరం నేను నేను అంటున్నాం కదా, ఈ నేను అని అనేది ఎవరు? ఈ శరీరం అంటుందా నేను అని లేకపోతే మనసు అంటుందా నేను అని? శరీరం నేను అంటోంది అనుకోండి, ఎవరిని కూడా శ్మశానానికి తీసుకువెళ్లనివ్వదు. ఎత్తుకునేటప్పటికి ఎవర్రా? మీరేవర్రా నన్ను తీసుకువెళ్లడానికి అని అడుగుతుంది. ఇంక ఎవడు శ్మశానానికి వెళ్లడండి శరీరానికి కూడా నేను అనే శక్తి ఉంటే. శరీరం నేను అనటం లేదు. శరీరం నేను అనదు. అయితే నేను అని ఎవరు అంటున్నారు? లోపల మనస్సు నేను అంటుంది. అయితే ఆ మనస్సే కనుక నిజం అయితే నాకు దుఃఖం ఎందుకు వస్తోంది. అశాంతి ఎందుకు వస్తోంది? నిజం లోంచి దుఃఖం వస్తుందా? నిజం లోంచి అశాంతి వస్తుందా? ఈ నేనునిజంగా కుదురుగా ఉంటుందా మనకు, ఈ నేను ఏమైనా సుఖ పెడుతోందా మనల్ని. బాగా ధనవంతులు ఉన్నారు అనుకోండి మీ దగ్గర ధనం అంతా ఖర్చుపెట్టి ఈ నేనుని పోగొట్టుకోగలరా? ఈ నేను అన్ని పనులు చేస్తుంది. కానీ నా జోలికి రావద్దు అంటుంది. ఎవరి జోలికి అయినా వెళ్తున్నాం కాని, మనం ఎవరిమైన నేను జోలికి వెళుతున్నామా చెప్పండి. పుణ్యం చేయమంటే పుణ్యం పనులు చేస్తుంది, పాపం చేయమంటే పాపపు పనులు చేస్తుంది. అన్ని పనులు చేస్తుంది. కాని అది ఒకటే చెప్తుంది. మీరు ఏ జన్మలో కూడా నా జోలికి రాకండి. ఎవడికైతే ఈశ్వర అనుగ్రహం కలిగిందో వాడికే ఈ నేనుని తెలుసుకోవాలని కాంక్ష బయలుదేరుతుంది. లేకపోతే ఎవరికీ కలగదు. వేమన ఏమన్నాడు అంటే, బీదవాడు చచ్చిపోతే ఊళ్ళోపక్కింటి వాడు కూడా చెప్పుకోడు. ధనవంతుడికి మటుకు చేతిమీద ఎక్కడైనా కురుపు వేస్తే దేశం అంతా చెప్పుకుంటారు. ఈ నేను ఒక నేనా అండి, ఈ నేను వేరు, కలలో వచ్చే నేను వేరు మళ్ళీ. రాత్రి కలలో వస్తుంది చూడండి ఆ నేను వేరు, ఈ నేను వేరు. ఈ నేను అక్కడ ఉండదు, వెలుగు వచ్చిన తరువాత సిద్ధం అవుతాడు ఈయన. మనకు కుండ నిండా అన్నం ఉంది అనుకోండి, కలలో మనకు ఆకలి వేస్తుంది అనుకోండి ఈ అన్నం మన ఆకలి తీరుస్తోందా అండి, ఆకలి తీర్చదు. అందుకే ఈ నేను వేరు ఆ నేను వేరు. వాడేమో కలలో ఏడిపిస్తాడు, మెలకువ వచ్చాక మళ్ళీ ఈ నేను పట్టుకుంటాడు. మీకు అర్థం అవుతుందా,

మొత్తం మీద వాడు వీడు కలిపి నీ నెత్తిమీద పడుతున్నారు. ఆ నేను గొడవ వీడికి అక్కర్లేదు, ఈ నేను గొడవ వాడికి అక్కర్లేదు మధ్యలో మన ప్రాణం పోతుంది. ఇద్దరు పీడించేది మనలని. గంటా, రెండు గంటలు మటుకు సుఖంగా ఉంటాం. గాఢనిద్రలో మటుకు సుఖంగా ఉంటాము. అప్పుడు ఈ రెండు నేనులు ఉండరటండి. కలలు ఎక్కువ వస్తున్నాయి అంటే మీరు సుఖంగా నిద్ర అవ్వనట్టే లెక్క. అక్కడ కూడా నేను ఉంటే, ఆ నేను నీ ప్రాణం తీసేస్తుంది.

ఏనుగు ఉంది అనుకోండి కొంచెం పొగరెక్కిందా ఊరంతా పాడు చేసేస్తుంది. అయితే దానిని మచ్చిక చేసుకున్నాము అనుకోండి, మనకేమి అపకారం చెయ్యదు. మన మనస్సు కూడా ఏనుగు లాంటిదే. మీరు పూజ చేసినా జపం చేసినా మీ మనస్సు మీ కంట్రోల్ లో లేకపోతే మీ పూజ వ్యర్ధం మీ జపం వ్యర్ధం. జ్ఞాపకం ఉంచుకోండి. మాకోసం మీరు పూజ చేయటం ఏమిటండీ. మీ మనసు బాగుపడటం కోసమే ఈ పూజలు, జపాలు అన్నీ అంతే కానీ ఈ పూజలు, జపాలు, తపాలు మా కోసమా? మీరు పూజ చెయ్యకపోతే రాముడికి కొరత వచ్చిందా? మీ పూజ కోసం ఎదురు చూస్తున్నాడా కృష్ణుడు? పొగరెత్తి, పొగరెత్తి మదపుటేనుగులా కొట్టుకుంటున్న ఈ మనస్సును, ఈ అహంకారాన్ని స్వాధీనంలోకి తెచ్చుకోవటం కోసమే ఈ పూజలు, ఈ జపాలు, దానాలు. లేకపోతే ఇవి అన్నీ ఎందుకండి? ఈశ్వరుడికి కావాలా మీరు చేసే దానం. మీరు ప్రశ్న అడగకపోతే కృష్ణుడు బెంగ పెట్టుకుంటాడా, రాముడు భోజనం చెయ్యడా మీరు రామా అనకపోతే, కనిపెట్టుకున్నారా వాళ్ళు అందరూ మీ కోసం. ఎవరికోసం ఇవన్నీ చేస్తున్నాము? మన మనస్సు పొగరెత్తి కొట్టుకుంటోంది అన్న సంగతి మనం మరచిపోయాము. నీ మనస్సుని స్వాధీనంలోకి తెచ్చుకోవటం కోసమే పరమేశ్వరుడు పూజలు చెయ్యమన్నాడు, జపాలు చెయ్యమన్నాడు, దానాలు చెయ్యమన్నాడు మంచి చెయ్యమన్నాడు అన్న సంగతి కూడా మనం మరచిపోయాం. ఆయన కోసం చేస్తున్నాం అని మనం అనుకుంటున్నాం. ఎంత అజ్ఞానంలో కూరుకుపోయామో చూడండి. మనం మచ్చిక చేసుకున్న ఏనుగు మనకు ఎంత ఉపకారం చేస్తుందో,మనం స్వాధీనంలోకి తెచ్చుకున్న మనస్సు మనకు అంత ఉపకారం చేస్తుంది. పొగరెక్కిన, మదమెక్కిన ఏనుగు ఎంత అపకారం చేస్తుందో మన మనస్సు మన స్వాధీనంలో లేకపోతే మన మనస్సు కూడా పొగరెక్కి కొట్టుకుంటుంది కాబట్టి అంత అపకారం మనకే చేసేస్తుంది. ఎదుటి వాళ్లకి కాదు, మనకే చేసేస్తుంది. మన మనస్సే మనకు ఉపకారం చేస్తుంది, మన మనస్సే మనకు అపకారం చేస్తుంది కాబట్టి నీ మనస్సే నీకు మిత్రుడు, నీ మనస్సే నీకు శత్రువు అన్నాడు భగవంతుడు. మీ మనసుని మీరు స్వాధీనంలో తెచ్చుకోవటం కోసం మీరు ఈ పనులన్నీ చేస్తున్నారు అన్న సంగతి మీరు ఏనాడో

మర్చిపోయారు. భగవంతుడు మంచి చెయ్యమన్నాడు. ఎవరికోసం? మనం మంచి చేస్తే మనకు మనస్సు స్వాధీనంలోకి వస్తుంది. అందుకు చెయ్యమన్నాడు. ఎప్పుడైతే మోహానికి గురి అయ్యానో, ప్రపంచంలో ఒక వస్తువుకో, ఒక రూపానికో, ఒక నామానికో, ఒక కీర్తికో, ఒక మంచికో, ఒక చెడ్డకో, ఎపుడైతే నేను గురి అయిపోయానో, ఇంక నీకు నిజం తెలియదు. మీరు అందరూ మంచివాళ్ళు అయినప్పటికి మీ మీద నాకు అసూయ ఉంటే మీలో ఉన్న మంచి నాకు తెలియదు. మీరు అందరూ చెడ్డవాళ్ళు అయినప్పటికి మీ మీద నాకు మోహం ఉంటే, మీరు అందరూ గొప్పవాళ్ళ కిందే నాకు కనిపిస్తారు. మరి దోషం ఎక్కడుంది? మనసులో దోషం ఉంది. మనస్సులో ఎంత కాలం అయితే దోషం ఉందో, ఈ దోషంతో కూడిన మనస్సు, నిజాన్ని తెలుసుకోవటానికి పనికిరాదు. సత్యాన్ని తెలుసుకోవడానికి పనికిరాదు. రాగద్వేషాల తోటి ఉడుకెత్తి పోయి కొట్టుకుంటున్న మీ మనస్సు నిజాన్ని తెలుసుకోవటానికి పనికి రాదు. ఆ మనస్సును బాగుచేసుకోవటం కోసం మంచి చెయ్య మన్నాడు. మిమ్మల్ని ఉద్దరించడానికి నేను ఎవరిని అండి, ఈశ్వరుడు లేడా? ఉద్దరించే పని ఈశ్వరుడిదా? నాదా? ఈ ప్రపంచాన్ని అంతా, ఈ సృష్టిని అంతా భరించే ఈశ్వరుడు మిమ్మల్ని భరించలేడా? మనం స్పష్టంగా ఆలోచించగలగాలి. రాగద్వేషాలు లేకుండా ఆలోచించగలగాలి. రాగద్వేషాలు ఉన్నాయి అనుకోండి మనం ఆలోచించలేము. ఆలోచించడానికి సరిగ్గా ఆలోచన రాదు. మీరు మంచి పని చెయ్యండి, ఏ పని చేసినా మీ మనసును మీరు బాగు చేసుకోవడానికి మాత్రమే చేయండి. మీరు ఎదుటి వారికి ఎవరికైనా ఉపకారం చేస్తున్నారు అనుకోండి, ఉపకారం చేయండి. మీరు ఉపకారం చేసి వాళ్ళని ఉద్దరిస్తాము అనుకోకండి. భగవంతుడు చెప్పాడు కాబట్టి చేయండి అంతే. ఎదుటి వారికి మీరు ఉపకారం చేయండి. ఏదో మేము అందరినీ ఉద్దరిస్తున్నాం అని ఆ మాయలో పడకండి. భగవంతుడు చెప్పాడు కాబట్టి చెయ్యండి అంతే, అలా చేసి మీరు వదిలేస్తే మీ మనస్సు బాగుపడుతుంది. నేను ఉద్ధరిస్తున్నాను అనుకుంటారనుకోండి మీకు అహంకారం పెరిగిపోతుంది.

స్వామి వివేకానంద ఇంకో రహస్యం చెప్పాడు. మీరు గుళ్ళోకి వెళుతున్నారు అనుకోండి, గుళ్ళోకి వెళ్లి అక్కడ డిబ్బీలో రూపాయి వేస్తారు. లేదా రెండు అరటి పళ్ళు ఇస్తారు. దేవుడి గుళ్ళోకి వెళ్లి రూపాయి ఇస్తే,దేవుడికి ఉపకారం చేసాను అని మీరు ఎవరైనా అనుకుంటున్నారా? స్వామి వివేకానంద చెప్పిన మాటలు ఇవి. మీరు దేవుడి గుళ్ళోకి వెళ్లి ఒక రూపాయి ఇచ్చారు అనుకోండి, ఏవండీ ఇవాళ నేను దేవుడి గుళ్ళోకి వెళ్లి ఒక రూపాయి దానం చేసి వచ్చాను అని మీరు ఎవరైనా అంటారా? లేదు మరి మీరు, ఏమనుకుంటున్నారు? పూజ చేసాను అనుకుంటున్నారు. అక్కడ రూపాయి ఇచ్చి పూజ చేసాను అనుకుంటున్నారు.

ఎవరికో బీదవాడికి ఇస్తే మటుకు మీరు పూజ అనుకోవటం లేదు. దానం అనుకుంటున్నారు. మీరు దేవుడికి రూపాయి ఇచ్చేటప్పుడు ఎటువంటి భావనతో ఇచ్చారో, బీదవాడికి కూడా అటువంటి భావన తోటి ఇవ్వండి మీ మనసు బాగుపడుతుంది అని చెప్పారు. అక్కడేమో పూజ అనుకుంటున్నారు. ఇక్కడేమనుకుంటున్నారు దానం అనుకుంటున్నారు. ఇది ఎందుకు మీరు పూజ అనుకోరు? అదే పూజా? ఇది పూజ కాదా? ఎంత టైము తీసుకుని ఏమి చెప్పుకున్నాము అనేది కాదు ఏమి నేర్చుకున్నాము అనేది చాలా ముఖ్యం.

సినిమాలలో NT రామారావు కృష్ణుడి వేషం వేశాడు, రాముడి వేషం వేశాడు, శివుడి వేషం వేశాడు. పెద్దవాళ్లు చూసినప్పుడు వాళ్ళు NT రామారావు అనుకుంటారు. పిల్లలు చూశారు అనుకోండి వాళ్ళు NT రామారావు అనుకోరు, కృష్ణుడి వేషం వేస్తే కృష్ణుడు అనుకుంటారు. రాముడి వేషం వేస్తే రాముడు అనుకుంటారు. శివుడి వేషం వేస్తే శివుడు అనుకుంటారు పిల్లలు. అందుచేత భగవంతుడు ఒక్కడే వాడే రాముడి వేషం వేసుకుని వచ్చాడు. వాడే కృష్ణుడి వేషం వేసుకుని వచ్చాడు. వాడే శివుడి వేషం వేసుకుని వచ్చాడు. వాడే కుమార స్వామి. అది జ్ఞానికే తెలుస్తుంది. మనకు నామరూప దృష్టి ఉంది కాబట్టి ఈ రూపం వేరు ఆ రూపం వేరు అనుకుంటాం. ఈ రూపాలు ఏమీ నిజం కాదు. త్రికాలాల్లో ఉన్నది ఆత్మ. దాన్ని చేరుకునేవరకూ మన ప్రయాణం ఆగదు. వెళ్ళాలి అనుకున్న వాళ్ళేమో, అరుణాచల యాత్ర ప్రారంభం అవుతుంది అనుకుంటున్నారు. వెళ్ళి వచ్చేసిన వారు ఏమనుకుంటున్నారు అంటే మా యాత్ర పూర్తి అయ్యి పోయింది అనుకుంటున్నారు. యాత్ర అంటే అది కాదు. మరణించటం, పుట్టటం యాత్ర. మరణించటం యాత్ర మళ్ళీ జన్మించటం యాత్ర. అది దీర్ఘ యాత్ర అది endless. ఈ యాత్రకి ముగింపు ఉంది.వారం రోజులు, పది రోజులు. ఆ యాత్రకి ముగింపు లేదు. సత్యాన్ని దర్శించే వరకూ, హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మని దర్శించే వరకూ, అది ఏ జంతువు కడుపులోనో,లేకపోతే మనిషి కడుపులోనో,ఎక్కడో చోట దేవతా రూపంలోనో, రాక్షస రూపంలోనో, మంచి జన్మో, చెడ్డ జన్మో ఏదో ఒక రూపంలో మొత్తం మీద శరీరం వచ్చి తీరవలసిందే, శవాలను మోయవలసిందే ఆ యాత్ర పూర్తి అయ్యేవరకు! యాత్ర అంటే ఏమిటి? మరణించటం యాత్ర? జన్మించటం యాత్ర? అది యాత్ర. స్త్రీ శరీరం రావచ్చు. పురుష శరీరం రావచ్చు. జంతువు శరీరం రావచ్చు. లేకపోతే దేవతల శరీరాలు రావచ్చు. భగవంతుడికి పురుషుడు అని కూడా ఒక పేరు ఉంది. పురుషుడు అని పేరు ఎందుకు వచ్చింది? శరీరానికి పురం అని పేరు ఉంది ఈ పురంలో కాపురం ఉంటున్నాడు కాబట్టి పురుషుడు అని పేరు వచ్చింది. ఇది పురం. స్త్రీ శరీరం అయినా పురమే, పురుష శరీరం అయినా పురమే. ఈ పురంలో ఉండేవాడు పురుషుడు. అందుచేత భగవద్గీతలో పదిహేనవ అధ్యాయం పురుషోత్తమ ప్రాప్తి యోగం. ఆ పురుషోత్తముడిని ఎలా తెలుసుకోవాలో పదిహేనవ అధ్యాయంలో మనకు

వివరంగా చెప్పాడు భగవంతుడు. మన హృదయంలో ప్రకాశిస్తున్న పురుషుడిని మన అనుభవంలోకి ఏ రోజున అయితే తెచ్చుకుంటామో, ఏ గంటలో అయితే తెచ్చుకుంటామో, ఏ జన్మలో అయితే ఆ స్థితిని మనం పొందుతామో, ఆ స్వరూపాన్ని మనం పొందుతామో, అప్పుడు ఆ గడియ తోటి మనకు యాత్ర ముగుస్తుంది. అప్పటివరకు యాత్రకి ముగింపు లేదు. యాత్ర చేస్తూ ఉండవలసిందే. చచ్చిపోవటంతోటి దేహసంబంధం తెగిపోతుంది కదా ఎవరికైనా, ఇదే కనుక సంసారం అయితే మీరు చచ్చిపోయిన తరువాత మీకు ముక్తి ఎందుకు రావటం లేదు? అందుచేత సంసారం అంటే మనుషులు కాదు. మనం ఎంత బాగా అర్థం చేసుకోగలిగితే, ఎంత సూక్ష్మంగా అర్థం చేసుకోగలిగితే మన ప్రయాణం అంత తేలిక అవుతుంది. అందుకే అర్థం లేని చదువు వ్యర్థం, అర్థం లేని చదువు అనర్థం తీసుకువస్తుంది. ఏది సంసారం? నాకు భయం వేస్తుంది అనుకోండి అది సంసారం. నాకు కామం వస్తుంది అనుకోండి అది సంసారం. నాకు కోపం వస్తుంది అనుకోండి అది సంసారం. ఇక్కడ కూర్చొన్న వాళ్ళలో కొంతమంది మీద ఇష్టం. కొంతమంది మీద అయిష్టం నాకు వస్తుంది అనుకోండి అది సంసారం. ఈ సంసారం పోయే వరకూ విముక్తి లేదు. ఈ సంసారం బయట ఉందా? లోపల ఉందా? మీరు ఆలోచించండి. బయట ఉన్న మనుషులు సంసారమా? ఇప్పుడు లోపల ఉన్న వికారాలు సంసారమా? ఏది సంసారం? నాలో ఉన్న బలహీనతలే సంసారం.

చాలామందికి భయం ఉంటుంది. అయితే ఇప్పుడు మేము అందరం భయం లేకుండా కూర్చొన్నాము అని మీరు అనుకోవచ్చు. భయ కారణం ఎదురుగా ఉన్నప్పుడు కూడా భయం ఉండకూడదు. అది భయం లేకుండా ఉండడం అంటే. మీకు భయం కలుగుతోంది అంటే మీకు జన్మలు ఉన్నట్టే, కొండ గుర్తుపెట్టుకోండి. ఏ కారణం వల్ల అయినా మీకు భయం వస్తోంది అంటే సంసారం వచ్చేస్తుంది. మీరు మరణించాక మళ్ళీ సంసారం వస్తుంది. వ్యక్తులు మారతారు. వస్తువులు మారతాయి. రూపాలు మారతాయి,ఊళ్ళు మారతాయి, దేశాలు మారతాయి. కాల పరిస్థితులు మారతాయి. నేను సాధన చేసుకొంటూ అడవిలో ఉన్నా సరే నాకు భయం వేస్తుంది అంటే నేను సంసారంలో ఉన్నట్టే. ఇంట్లో కూర్చొని మీరు రాగద్వేషాలకు అతీతంగా ఉన్నారు అనుకోండి మీరు సంసారంలో లేనట్టే. ఇది బాగా గుర్తు పెట్టుకోండి. అందుచేత మీరు ఎక్కడ కూర్చొన్నారు? అరణ్యంలో కూర్చొన్నారా? ఇంటికాడ కూర్చొన్నారా? ఆశ్రమంలో కూర్చొన్నారా? అనేది సమస్య కాదు. మీ లోపల ఉన్న వికారాల లోంచి బయట పడ్డారా లేదా? అది ముఖ్యం.భయం అనేది జీవుడి లక్షణం, కాని ఆత్మ లక్షణం కాదు. ద్వైతం లోంచి భయం పుట్టింది. ద్వైతం లోంచి ద్వేషం పుట్టింది. ద్వైతం లోంచి కామం పుట్టింది. ద్వైతంలోంచి ఇష్టం పుట్టింది. ద్వైతం లోంచి అయిష్టం పుట్టింది. ఉన్నది ఒక్కటే వస్తువు అది ఆత్మ. అది అనుభవంలోకి రానంత కాలం మీకు

భయం వేస్తూ ఉంటుంది. అంతకాలం జన్మలు వస్తూ ఉంటాయి.మీకు ఎప్పుడైనా భయం వేస్తుంటే, మిమ్మల్ని భయం నుండి విడుదల చేసిన వ్యక్తి నీ తల్లి కంటే, నీ తండ్రి కంటే కూడా ఎక్కువ. అయితే ఈశ్వరుడి పట్ల ప్రీతి పెంచుకుంటే భీతి పోతుంది అన్నారు. అయితే సద్గుణాలు ఎందుకు? దుర్గుణాలు ఎందుకు ఉండకూడదు? నీరు లేకపోతే శరీరాన్ని ఏవిధంగా అయితే శుద్ధి చేయలేమో, అదేవిధంగా మంచిగుణాలు లేకపోతే మనస్సుని శుద్ధి చెయ్యలేము. నీరేమో శరీరాన్ని శుద్ధి చేస్తుంది. మంచిగుణం ఏమో మనసు చేత స్నానం చేయించి, మనసుని శుద్ధి చేయిస్తుంది. ఎప్పుడైతే మనస్సు శుద్ధి అయ్యిందో, మనస్సు నిర్మలం అయ్యిందో, మనస్సు పాపం లోంచి, లోకం లోంచి ఎప్పుడైతే బయట పడిందో, అది ఆత్మ వైపుకి ప్రయాణం చేస్తుంది. శుచి అయిన మనస్సే, నిర్మలం అయిన మనస్సే, అణిగిన మనస్సే ఆత్మ వైపుకి ప్రయాణం చేస్తుంది. శరీరానికి కుటుంబం కాని ఆత్మకి కుటుంబం ఏమిటండీ? గర్వం కూడా మిమ్మల్ని స్వరూపానికి దూరంగా తీసుకెళ్ళి పడేస్తుంది. మీరు ఏ మతం అని కాదు, ఏ కులం అని కాదు, ఏ దేవుణ్ణి మీరు ప్రార్థిస్తున్నారు అని కాదు. మీ మనస్సు, మీ ఇంద్రియాలు జాగ్రత్తగా మీరు చెప్పినట్టు వినాలి. వాటి చేతిలో మనం ఉండకూడదు. మన చేతిలో అవి ఉండాలి. రాగద్వేషాలు అనే తాడు మన మనస్సుని కట్టేస్తుంది. అలా బంధింపబడిపోయి ఉంటుంది అన్నమాట. జన్మ జన్మలకి ఇదే పని. మనిషికి దుఃఖం వస్తోంది కదా మరి రాగద్వేషాలు లేకపోతే, ఈర్ష్య లేకపోతే, అసూయ లేకపోతే, భయం లేకపోతే మనిషికి దుఃఖం ఎందుకు వస్తుంది?

ధైర్యం ఎందుకు కావాలి? ధైర్యం కనుక లేకపోతే యోగం సిద్ధించదు. పిరికితనం ఉంది అనుకోండి వాడు యోగానికి పనికి రాడు. ఈశ్వరచింతనకి పనికి రాడు. ఎప్పటికైనా వియోగం తప్పదు కదా, దేనికి వియోగం? దేహం వచ్చిందంటే యోగం తప్పదు, వియోగం తప్పదు. ఆత్మకి వియోగం లేదు. ఆత్మకి యోగం లేదు. కలుసుకోవడం అంటే యోగం, విడిపోవడం అంటే వియోగం. ఇవి రెండూ దేహం ఉన్నంతకాలం తప్పదు, తప్పదు, తప్పదు. ఇదే సంసారం. ఏమండీ, నూరు సంవత్సరాల తరువాత కాటికి ఇంకా వెళ్ళమా, పోనీ ఇంకో వంద సంవత్సరాలు బ్రతుకుతాము అప్పుడైనా కాటికి తప్పదు కదా. శరీరం వచ్చిందంటే వస్తువుల తోటి, కాలమాన పరిస్థితుల తోటి, దేశాల తోటి వియోగం తప్పదు. శరీరం యొక్క ధర్మం అది. మీరు ప్రకృతి మనుషుల తోటి స్నేహాలు చెయ్యకండి. ప్రకృతి మనుషుల తోటి చాలా ప్రమాదం. వాళ్ళ తోటి స్నేహాలు ఎంత తగ్గించుకుంటే అంత యోగంలో మనం అభివృద్ధి పొందగలం. ప్రకృతి అన్నా, మాయ అన్నా, అవిద్య అన్నా అంతా ఒక్కటే. ఇవన్నీ పర్యాయ పదాలు. ఈశ్వరుడు అన్నా, గురువు అన్నా, ఆత్మ అన్నా ఒక్కటే. అతను మన హృదయంలో ఆత్మ రూపంలో ఉంటాడు. ఎప్పుడైతే ఆయన మనలని అనుగ్రహించాలి అనుకున్నాడో, అప్పుడు మన

హృదయాలని కెలుకుతూ ఉంటాడు. కెలికేటప్పుడు ఏమి అవుతుంది అంటే లోపల స్టోర్ అయినటువంటి గుణాలు బయటకి వచ్చేస్తాయి కక్కు వచ్చినట్టు. అప్పుడు మటుకు మనం ధైర్యంగా ఉంటే మన పని పూర్తి అయిపోయినట్టే. ప్రకృతి మనుషుల తోటి ఎంత ప్రమాదమో చూడండి. తుకారాం తోటి ఏమి చెప్పారంటే, నువ్వు పాండురంగా, పాండురంగా, పాండురంగా అంటావు, ఎవరికీ లేని కష్టాలు, మాములు మనుషులుకి కూడా లేని కష్టాలు నీకే వస్తున్నాయి. అందుచేత నువ్వు భక్తి వదిలేస్తే నీకు కష్టాలు తగ్గిపోతాయి అని చెప్పారు. తుకారం అన్నాడంట నాకు కష్టాలు వస్తున్నాయి. ఏమి భక్తి లేని వాడికి కూడా కష్టాలు వస్తున్నాయి కదా. మరి వాళ్లకి ఎందుకు వస్తున్నాయి? నాకు వచ్చిన కష్టాలు అన్నింటికి భక్తే కారణం అని మీరు అనుకుంటే, భక్తి ఏమి లేని వాడికి కూడా కష్టాలు వస్తున్నాయి. మరి వాడికి ఎందుకు వస్తున్నాయి. సర్వసాధారణంగా లౌకికులు కంటే ప్రకృతి మనుషులు కంటే భక్తులకి ఎక్కువ కష్టాలు వస్తాయి. దానికి ఒక కారణం ఉంది. దానికి కారణం ఏమిటంటే, నీ మనసులో ఎంతవరకు అల్పత్వం ఉందో, దాని ఉనికిని చూసుకుంటూఉంటాడు ఈశ్వరుడు. ఒక మాష్టారు ఒక స్టూడెంట్‌ని బయటకి గెంటేశాడు అనుకోండి, ఇంక వాడి గొడవ ఉండదు. పనికోచ్చేవాడిని పైకి తీసుకువద్దామని చూస్తాడు. మనం అందరం మోక్షాన్ని కోరుతున్నాం. ఈశ్వరుడు భక్తి వాసన ఉన్నవాడిని ఏమి చేస్తాడు అంటే, వాడి మనసుని అలా కదిపి చూస్తూ ఉంటాడు. అంటే వీడు ఏమైనా తట్టుకోగలడా? లేదా? అని, ఒక్కొక్క కష్టాన్ని అలా పంపిస్తూ ఉంటాడు. మనస్సుని కొంచెం బాగు చేస్తూ ఉంటాడు. అంటే వీడు ఎంతవరకు తట్టుకోగలడు? ఎంతవరకు నిలబడగలడు? ఆ పరీక్షలో ఫెయిల్ అవుతాడా? సక్సెస్ అవుతాడా? అని చూస్తాడు. కేవలం స్వప్రయత్నం వల్ల మనం సక్సెస్ అవ్వలేము. చిలక ఏమంటుంది మాములుగా రామ, రామ, రామ అంటుంది! నేర్పుతారు కదా. సరిగా పిల్లి వచ్చి పట్టుకునేటప్పటికి కీచ్ కీచ్ మంటుంది. ఎందుచేత? హృదయంలో ఉన్నది బయటకి వచ్చేసింది. నేర్చుకున్నది పోయింది. చిలుకకే కాదు మనకు కూడా నేర్చుకున్న విద్యలు మరణించే టైములో ఉండవు. నేర్చుకున్నది రాదు. మనం నేర్చుకున్నది మనకు వంటబట్టి మన హృదయంలో దిగితే, ఆ హృదయంలో ఉన్నది వస్తుంది.

మాయ ఎక్కడుందో చెప్పమంటారా? వైకుంఠంలో ఆత్మ ఉందనుకుంటున్నాం. ఇక్కడ లేదు అనుకుంటున్నాం. కైలాసంలో ఆత్మ ఉంది అనుకుంటున్నాం. ఇక్కడ లేదు అనుకుంటున్నాం. ఇక్కడ లేనిది అక్కడ లేదు. అక్కడ లేనిది ఇక్కడ లేదు. కాని ఈ విషయం మనకు అర్థం అయ్యే వరకూ మనకు జన్మలు తప్పవు. శాస్త్రం చదివి ప్రోపర్‌గా అర్థం చేసుకోలేక ఇన్ని ఇబ్బందులకు మనం గురి అవుతున్నాం, సాధన పేరు మీద ఎక్కువ కష్టపడి పోతున్నాం. కర్మయోగం వేరు, కామ్యకర్మ వేరు. మనం చేసేవి అన్నీ కామ్యకర్మలు.

మనం చేసేది కర్మయోగం కాదు. కర్మ యోగానికి, కామ్యకర్మకి పడదు. ఒకటి ఉత్తర ధృవం, రెండు దక్షిణ ధృవం. ఇరవై నాలుగు గంటలు వాడి పొట్ట కోసం వాడు పని చేసుకుంటే అది కర్మయోగమా? వాడి స్వార్ధం కోసం వాడు పని చేసుకుంటే అది కర్మయోగమా? మీరు స్వార్ధం లేకుండా, కోరిక లేకుండా, ఏమీ ఆశించకుండా పని చేస్తున్నారా? ఎవడి గుణాలు వాడికి తెలుసు కదా, మీరు చేసేది కామ్యకర్మ? కర్మయోగమా? కర్మయోగం జ్ఞానానికి తీసుకువెళుతుంది. కామ్యకర్మలు దేని వైపుకి తీసుకు వెళతాయి? అజ్ఞానము వైపుకి, క్షుద్ర లోకాల వైపుకి తీసుకు వెళతాయి. అయితే మనం చేసేది కామ్యకర్మా? కర్మయోగమా? నాకు ఈ కర్మయోగం అర్థం కావటం లేదు. కామ్యకర్మ అర్థం కావటం లేదు అని మీరు సోమరితనంగా కూర్చొంటే, సోమరితనం అనేది అకర్మవాదం. అది ఈ లోకానికీ పనికి రాదు. పరలోకానికీ పనికి రాదు.

అహింస గురించి ఇక్కడ భగవంతుడు చెబుతున్నాడు, శారీరకంగా కాని, వాచకంగా కాని, మానసికంగా కాని ఎదుటివారిని ఇబ్బంది పెట్టకుండా జీవించగలగాలి అదే అహింస! శారీరకంగా కాని, వాచకంగా కాని, మానసికంగా కాని ఎదుటి వాడికి క్షోభ కలగకుండా జీవించగలగాలి అదే అహింస. అహింస వల్ల ఏమి అవుతుంది మనసు అంతర్ముఖం అవుతుంది. ట్రూత్‌ని ఎవడైతే ప్రాక్టీస్ చేస్తున్నాడో, అహింసను ఎవడైతే ప్రాక్టీస్ చేస్తున్నాడో, వాణ్ణి మోక్షం వరిస్తుంది అని జాతిపిత గాంధీగారు చెప్పారు. ఒకటి సత్యం, రెండు అహింస. ఇవి రెండూ పట్టుకుని వేలాడండి చాలు మీకు మోక్షం వస్తుంది అని చెప్పారు. ఎదుటి వాళ్ళు కష్టపడుతుంటే అది చూసి నీకు సంతోషం కనుక కలుగుతుంటే, నీ మనసులో హింస ప్రవృత్తి ఉన్నట్టే. కృష్ణుడు ఇది అంతా జ్ఞాని కోసం చెప్పలేదు, జ్ఞానికి దైవీగుణాలు సహజంగా ఉంటాయి. ఏ గుణాలు అయితే జ్ఞానికి సహజంగా ఉంటాయో అవి మనకు సహజంగా ఉండవు కాబట్టి అవి నేర్చుకోమంటున్నాడు. మీరు ఎదుటివాళ్ళని ఎవరిని అయినా హింస పెడుతున్నారు అనుకోండి అది ఎప్పుడైనా ఏదోక జన్మలో మనం కూడా పడవలసిందే. అది ఈశ్వరుడి యొక్క చట్టం. అందుచేత ఎదుటివారిని కనుక హింస పెడుతుంటే నిన్ను నువ్వే హింస పెట్టుకుంటున్నావు. ఎదుటి వాడికి ఉపకారం చేస్తే నీకు నువ్వే ఉపకారం చేసుకుంటున్నావు. ఎదుటి వాడికి అపకారం చేస్తే, నీకు నువ్వే అపకారం చేసుకుంటున్నావు. ఈ విషయం నీకు అర్థం అవ్వనంతకాలం నువ్వు సబ్జెక్టుకి దూరంగా ఉంటావు. ఎదుటి వాడికి ఉపకారం చేస్తే ఆ ఉపకారం తనకే వస్తుంది అన్న సంగతి తెలుసుకున్న మనిషి ఉపకారం చెయ్యకుండా ఎలా ఉండగలడు అన్నాడు రమణమహర్షి. నువ్వు ఏది చేశావో అదే నీకు వస్తుంది. అది ఎటర్నల్ లా. మనకు గవర్నర్ జనరల్ చేసిన వాళ్ళలో ఫస్ట్ గవర్నర్ జనరల్ ఎవరంటే వారన్ ఏస్టన్స్. ఇంగ్లీషు వాళ్ళు మొట్టమొదట సంస్కృతం నేర్చుకుని,

వారన్ ఏస్టన్ టైములో భగవద్గీతని ఇంగ్లీషులో రాశారు. అనువాదం చేసి ఏమి చేశారంటే గవర్నర్ జనరల్‌ని ఫోర్‌వర్డ్ రాయమన్నారు. ఆయన ఏమి వ్రాసాడు అంటే పూర్వం ఈ భారతదేశాన్ని అనేకమంది పరిపాలించారు. ఆ రాజ్యాలు అన్నీ అంతం అయిపోయినవి. ఇప్పుడు మనం బ్రిటిష్ వాళ్లం, పరిపాలిస్తున్నాం. బ్రిటిష్ సామ్రాజ్యం కూడా కొంత కాలానికి అంతరించుకుపోవచ్చు. కానీ ఈ భగవద్గీతలో మాటలు మటుకు పరిపాలనకు అతీతంగా, దేశాలకు అతీతంగా, కాలానికి అతీతంగా, అన్నిపరిస్థితులకు అతీతంగా కలకాలం నిలబడే మాటలు అన్నీ ఈ గీతలో ఉన్నాయి అని వారన్ ఏస్టన్స్ రాశారు. అయితే ఈ భగవద్గీతలో ఇంకో విశేషం ఉంది. ఇది ప్రాక్టికల్ బుక్. గాల్లో మేడలు కట్టడు కృష్ణుడు, ప్రాక్టికల్ బుక్. విషయాలని నీ ముందు ఉంచి దానిని ఎలా ఆచరించాలో కూడా చెప్పాడు. విష్ణుసహస్ర నామాలలో ఒక చక్కటి మాట ఉంది. ఆమాట ఏమిటి అంటే సమయజ్ఞః ఆచార్య వినోబాబావే గారు ఏమన్నారు అంటే రమణమహర్షి గురించి ఆయనలో మనం నేర్చుకోవలసింది సమానత్వం అని చెప్పారు. సమత్వదృష్టి ఆ రూపం ధరించిందా అనిపిస్తుంది. అంత equality ఆయనలో కనిపిస్తుంది.

విష్ణుసహస్రనామాలలో ఏమి చెప్పారు అంటే సమ యజ్ఞః మీరు చేతులతోటి పూజలు చేయకపోయినా, నోటితోటి నామాన్ని స్మరించకపోయినా, నీ మనసుకు మటుకు సమాన దృష్టి కనుక ఉంటే, మీకు సమానదృష్టి కనుక అలవాటు పడితే, అది కూడా పూజే. అది కూడా యజ్ఞమే. దానితోటి కూడా మీరు నన్ను అరాధిస్తునట్టే అని చెప్పారు. విష్ణుసహస్ర నామాలలో, ఏమి చెప్పాడు అంటే హెచ్చుతగ్గులు లేనటువంటి సమానదృక్పథం మీ మనసులో కనుక ఏర్పడితే, ఆ సమానదృష్టి ద్వారా కూడా నన్ను మీరు అర్చన చేస్తున్నట్టే లెక్క. నన్ను మీరు పూజ చేస్తున్నట్టే లెక్క అని చెప్పాడు. కృష్ణుడు ఏమి చెప్పాడు గీతలో, ఆకులు ఇమ్మన్నాడు, పండు ఇమ్మన్నాడు, పోనీ అవి కూడా లేవు అనుకోండి నీళ్ళు ఇమ్మన్నాడు. నీళ్ళకి ఏమైనా ఖర్చు ఉందా అండి. ఈ మూడు లేవు అనుకోండి నాలుగోది నేను చెబుతున్నాను మీ కన్నీళ్లు ఇవ్వండి చాలు. నీళ్ళు ఇమ్మన్నాడు పోనీ ఆ నీళ్ళు కూడా మీకు దగ్గర లేవు అనుకోండి ఇవ్వటానికి నీళ్ళు లేవు, ఆకులూ లేవు, పళ్ళు లేవు అనుకోండి మీ కన్నీళ్లు ఇవ్వండి చాలు ఈశ్వరుడికి. కాళహస్తీశ్వర స్వామి “ఈ తిన్నడు పుక్కిలించి నీళ్ళు వేసేవాడు, పుక్కిలించి నెత్తిమీద నీళ్ళు వేస్తుంటే, గంగాజలం కంటే తీపిగా ఉంది” అన్నాడట. అంటే ఏమిటి అక్కడ నీళ్ళు ప్రధానం కాదు. నీళ్ళు వెనకాల ఉండే తిన్నడు యొక్క భక్తి. భక్తి యొక్క బరువు ఎంత ఉంది? అది కావలసింది. నిర్మలమైన, నిష్కామమైన భక్తి కనుక కుదిరితే ఈ జన్మలోనే తరిస్తావు నీకు ఏమీ సందేహం లేదు. ఈ జన్మలో ఉండగా, ఈ లోకంలో ఉండగా, ఇప్పుడే, మీ శరీరానికి మరణం రాక ముందే మీరు తరిస్తారు. అందులో అనుమానం లేదు. వస్తువు

ఇక్కడ సిద్ధంగా ఉంది కాబట్టి. అందరూ ఏమనుకుంటారు అంటే, మన శరీరాలు మనకు దగ్గరగా ఉన్నాయి అనుకుంటారు. కాని నా శరీరం కంటే నాకు ఆత్మ దగ్గరగా ఉంది. నా ప్రాణం కంటే నాకు ఆత్మ దగ్గరగా ఉంది. నా మనస్సు కంటే నాకు ఆత్మ దగ్గరగా ఉంది. వేషాల వేయటం వల్ల యోగం రాదు. వేషాలేస్తే రోగాలు వస్తాయేమో, వేషాలు వెయ్యటం వల్ల రాదు భక్తి. కపటం కోసం, గొప్పల కోసం ధర్మం ఆచరిస్తే మోక్షం రాదు. మీరు మంచి పనులే చేయొచ్చు, గొప్పల కోసం చేస్తే ఈశ్వరానుగ్రహం మీ మీద వర్షించదు. నిర్మలమైన మనసుతోటి, నిష్కామమైన బుద్ధి తోటి, ఎంత చిన్న పని అయినా చేయండి. అప్పడు ఈశ్వరుడి అనుగ్రహం మీకు కలుగుతుంది. అదే నిజమైన ఐశ్వర్యం. నాలో వినయం లేకపోతే నాకు వినయాన్ని ప్రసాదించు స్వామి అని భగవంతుడిని ప్రార్థించండి. ది గ్రేట్ క్వాలిటీల కోసం, మంచి గుణాల కోసం భగవంతుడిని ప్రార్థించండి.

రామానుజులు తిరిగి, తిరిగి ఆయన పర్యటనలో తిరుపతి వస్తాడు. వేంకటేశ్వర స్వామి రూపంలో ఆ కొండమీద మహావిష్ణువు ఉంటే, ఆ కొండ ఎక్కను నేను, ఆ కొండను నా పాదాల తోటి తాకకూడదు. పైకి రాను అంటాడు ఆయన. వాళ్ళ భక్తి చూడండి. కొండ మీద పాదాలు పెట్టడానికి ఆయన మనసు ఒప్పుకోవటం లేదు. అప్పుడు ఏమి చేసాడు.మోకాళ్లకి గుడ్డలు కట్టుకుని పాకుతూ వెళ్ళాడట, రామానుజులు సగం దూరం వెళ్ళేటప్పటికి అతని మేనమామ ప్రసాదం తీసుకువస్తాడు. అప్పుడు రామానుజులు చాలా బాధ పడతాడు. ఇదేమిటండి? మీరు పెద్దలు నాకు ప్రసాదం మీరు తీసుకురావడం ఏమిటి? ఎవరో పిల్లల తోటి పంపవచ్చును కదా, పైగా ఎక్కడ నుంచో కొండ పై నుంచి కిందికి ప్రసాదం తీసుకు రావడం. ఏవండీ పిల్లల తోటి పంపవచ్చును కదా, మీరు తీసుకువచ్చి నాకు ప్రసాదం ఇవ్వడం ఏమిటి అని బాధ పడతాడు రామానుజులు. అప్పడు రామానుజులు మేనమామ అంటాడు. చిన్న వాళ్ళ చేత పంపించకపోయావా అని నువ్వు అంటున్నావు. నేను చిన్నవాళ్ల కోసం చూశాను. నాకంటే చిన్నవాళ్లు ఎవరు కనపడలేదు అందుచేత నేనే తెచ్చాను అన్నాడంట. వాళ్ళ యొక్క వినయం చూడండి. అది భక్తి అంటే, అటువంటి భక్తి కనుక మన హృదయంలోకి వస్తే, అప్పడు మనకు దారి కనిపిస్తుంది. మనకు ఎప్పుడైనా భయం వేస్తుంటేనే భగవంతుడు కనిపిస్తాడు. మనకు పరిస్థితులు అనుకూలంగా ఉంటే మనసు అటు తిరగదు. భయం వేసినప్పుడు లేకపోతే ఇంటి దగ్గర ఏవైనా ఇబ్బందులు వచ్చినప్పుడు, అప్పుడు భగవంతుడు స్మరణలోకి వస్తాడు. సత్యాన్ని తెలుసుకోవడం నీ జీవిత లక్ష్యం అని చెబితే నీ వృత్తిని విడిచిపెట్టమని కాదు. వృత్తిని విడిచిపెడితే లక్ష్యం ఎక్కడా దొరకదు. మీరు ఏ వృత్తి చేసుకున్నప్పటికీ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకోండి. ఒక్కటే లక్ష్యం. సత్యమే లక్ష్యం. ఏది సత్యం? ఆత్మే సత్యం. రోజూ తిండి కావాలి, బట్ట కావాలి, నీడ కావాలి

వీటి కోసం మనం కృషి చేసుకుంటున్నాం కాబట్టి చేసుకోండి, వీటి కోసం మీరు లక్ష్యాన్ని విడిచిపెట్టక్కరలేదు. వీటికోసం దానిని విడిచిపెట్టవద్దు. దైవీగుణాలు, దైవీసంపద మనకు లేదని బాధ పడొద్దు. సంపాదించుకోమని చెబుతున్నాడు భగవంతుడు. వీటిని సంపాదించుకోవడం వలన మనకు లాభం ఏమిటి? లోపల శుద్ధి జరుగుతుంది. లోపల పవిత్రులం అవుతాము. మంచిగుణాలు మనకు లేకపోవచ్చు. మంచిగుణాలు ఉన్నవాళ్లని గౌరవిస్తోందా మన మనస్సు? దైవీసంపదలో భగవంతుడు చెప్పిన గ్రేట్ క్వాలిటీలు మనకు లేకపోవచ్చు. కనీసం ఈ గుణాలు ఉన్న వాళ్లని గౌరవించే స్వభావం అయినా మనకు ఉందా? మీ దగ్గర నుంచి గౌరవాలు కాని, రూపాయలు కాని, ఆశించేవాడు ఆచార్యుడు కాదు. నిజమైన ఆచార్యుడు కనీస అవసరాలతోటి satisfy అయిపోతాడు.

వైష్ణవసంప్రదాయంలో ఒక ఆచార్యుడు ఉండేవాడు. అతని కోసం రోజూ కొంతమంది బియ్యం పంపేవారు. ఒక రోజున ఏమయ్యింది అంటే ఒక అమ్మగారు సరిగ్గా బియ్యంలో రెండు కాసులు బంగారం కలిపారు. ఆచార్యుల వారి భార్య బియ్యంలో బెడ్డలు ఏరుతూ ఉంటారు. బెడ్డలు ఏరేటప్పుడు ఈ రెండు కాసుల బంగారం కనపడింది. "ఏవండీ ఇవాళ బియ్యం పంపారు. ఎవరు పంపారో కాని అందులో బంగారం కనిపిస్తోంది మరి ఈ బంగారం ఏమి చెయ్యాలి?" అని ఆవిడ అడిగింది. అప్పుడు ఆయన "నువ్వు బియ్యం ఏరుతున్నావు. బియ్యం ఏరేటప్పుడు బెడ్డలు వస్తున్నాయి. బెడ్డలు ఎక్కడ పడేస్తున్నావు? ఇవి కూడా అక్కడే పడేయ్" అన్నారు. అది భక్తి అంటే. గాంధీగారిని స్వరాజ్యం వచ్చిన తరువాత ఏవండీ మొదటి ప్రధానమంత్రిగా మీరే ఉండకూడదా అన్నారు. మీరే ఉండకూడదా అంటే, అందులో నేను పట్టను అన్నారాయన. ఆత్మ పదవిలో పడుతుందా? పెద్ద ఏనుగుని చిన్న గుడిసెలో పెడితే ఎలా ఉంటుందో ఇపుడు నా పరిస్థితి అలా ఉంది అన్నారు రమణమహర్షి గారు. అది వాళ్ల స్థితి. నీకు లోపల దోషం ఉన్నంతకాలం ఈ ప్రపంచం నిజంగా కనిపిస్తుంది. లోపల వాసన ఉన్నంతకాలం ఇది నిజంగా కనిపిస్తూ ఉంటుంది. లోపల అజ్ఞానం ఉన్నంతకాలం ఇది నిజంలా కనిపిస్తుంది. ఇది నిజంలా కనిపిస్తున్నంత కాలం మనస్సు ఏదోక వస్తువు మీద వాలుతూ ఉంటుంది. ఏదోక వస్తువును వాంఛిస్తూ ఉంటుంది. లోపల ఉన్న అజ్ఞానం తెగేవరకూ, వాడి ప్రయాణం పూర్తి కాదు. ఈ అజ్ఞానాన్నే కారణ శరీరం అంటారు. అది తెగవలసిందే. అది ఎంతకాలం అయితే తెగదో, అంతకాలం ఈ దేహాలు వస్తూనే ఉంటాయి. అయితే చచ్చిపోయిన తరువాత ఏమి అవుతాము. మన మనసుతోటి, మన ఇంద్రియాల తోటి ఇప్పుడే నిద్రలో మనకు సంబంధం తెగిపోతుంది కదా. ఇక్కడ 24 గంటలూ మన ఇంద్రియాలే మన కూడా ఉండటం లేదు. మన మనస్సే మన కూడా ఉండటం లేదు. గాఢనిద్రలో మన ఇంద్రియాల తోటి, మన మనస్సుతోటి,

మన అహంకారంతోటి మనకు ఉన్న సంబంధం తెగిపోతుంది. అయితే ఈశ్వరానుగ్రహం లేకుండా మటుకు ఎవరికీ తన మనస్సు కాని, తన ఇంద్రియాలు కాని వాడికి స్వాధీనంలోకి రావు. ఈశ్వరానుగ్రహం వచ్చేవరకూ దానికోసం మనం వేచి చూడాల్సిందే, అది మనం డిమాండ్ చేసేది కాదు. దానికోసం వేచి చూడాల్సిందే. అది వచ్చేవరకూ కూడా మన ఇంద్రియాలు కాని, మన మనస్సు కాని మన స్వాధీనంలోకి రాదు. అవి స్వాధీనంలోకి వస్తేనే కాని మనకు ఆత్మదర్శనం కాదు. ఇప్పుడు మనం ఇక్కడ కూర్చొని మాట్లాడుకుంటున్నాం, ఇది కూడా స్వప్నంతో సమానమే. ఆత్మే యదార్థం. నిద్రలో మీకు కలలు వస్తున్నాయి. కలలో కూడా నీకు ఎక్కడెక్కడో తిరుగుతున్నట్టు వస్తున్నాయి. మీ దేహం మంచం మీదే ఉంటుంది. మీ లోపల వాసనలు లేకపోతే, సంస్కారాలు లేకపోతే నీకు కలలు ఎందుకు వస్తున్నాయి? దేహం ఎందుకు శుష్కిస్తుంది మనకు, ఇవన్నీ మీ అనుభవంలో ఉన్నవే కదా, స్వప్నం మీ అనుభవంలో ఉన్నదే కదా.

మనం ఏమి అనుకుంటున్నాం అంటే మనలో దేవుడు ఉన్నాడు అనుకుంటున్నాం. అది అబద్ధం, దేవుడిలో మనం ఉన్నాం. మనం అనుకునేవి అన్నీ అబద్ధాలే. మనకంటే చిన్నవాడా ఆయన? మనలో దేవుడు ఉండడం కాదు, దేవుడిలో మనం ఉన్నాం. మనకు అర్థం అవ్వటం కోసం ఏదో సెంటర్ పెట్టారు అంతే. హృదయంలో ధ్యానం చెయ్యటం కోసం అక్కడే ఉన్నాడు అని చెప్పారు కానీ ఇంక, ఎక్కడా లేడు అని కాదు. అంతటా దేవుడు ఉన్నాడు కదా మరి గుడి ఎందుకు అండి అని కొంతమంది అంటారు. బడి ఎందుకో గుడి అందుకే. గుడి అయినా, బడి అయినా మొద్దు అబ్బాయిలకే, చలం గారిని ఎవరో అడిగారు. ఏవండీ, ఏంటి మీరు అరుణాచలం నుండి కదలటం లేదు అని, మొద్దు అబ్బాయిని కాబట్టి ఆయనకి దగ్గరగా కూర్చొన్నాను అన్నాడు. విద్యావాతావరణం కలుగజేయటానికి బడి, భక్తి వాతావరణం కలుగజేయటం కోసం, ఆధ్యాత్మిక వాతావరణం కలుగజేయటం కోసం, ఒక దేవుడు ఉన్నాడు అని గుర్తు రావటం కోసం గుడి. చదువు కోసం బడి. భక్తి కోసం గుడి. అంటే అక్కడే దేవుడు ఉన్నాడు ఇంక ఎక్కడా దేవుడు లేడు అని కాదు అర్థం. అంటే మనం స్వయంగా వెళ్ళటం కోసం అవి ఏర్పాటు చేశారు. ఏకాగ్రత కోసం, ఉపాసన కోసం, దేవుడు ఉన్నాడు అనే గుర్తు కోసం. మీరు ఎప్పుడైనా బ్యాంకు చూశారు అనుకోండి డబ్బులు జ్ఞాపకం వస్తాయి. డాక్టరు గారిని చూస్తే రోగాలు జ్ఞాపకం వస్తాయి. గుడి కనిపించింది అనుకోండి, శిఖరం వైపుకి చూసాం అనుకోండి దేవుడు జ్ఞాపకం వస్తాడు. భగవంతుడే మనకు ధనం, భగవంతుడే డబ్బు. భగవంతుడి కంటే మించిన ఐశ్వర్యం ఏముంది? మన మాటకి, చేతకి సంబంధం లేదు. చెప్పేది ఒకటి, చేసేది ఒకటి. భౌతికంగా చూస్తే నోటికి దగ్గరగానే ఉంది చెయ్యి. కాని నోటితో చెప్పింది

చేతితో చెయ్యటం లేదు. చేతితో చేసింది, నోటితో చెప్పటం లేదు. మరి మీరు భగవంతుడికి దూరంగా ఉన్నారా? దగ్గరగా ఉన్నారా? ఇప్పుడు చెప్పండి. వాడికి ఈశ్వరానుగ్రహం ఎక్కడ నుంచి వస్తుంది? మనస్సుతో ఆలోచించేది ఒకటి, నోటితో చెప్పేది ఒకటి, చేతితో చేసేది ఒకటి ఇవి మూడు దేనికి ఒక దానితో ఒకటి ఏమి సంబంధం లేదు. వాడికి ఈశ్వర అనుగ్రహం ఎలా వస్తుంది?

ఈశ్వరుడే సర్వసాక్షి! మనకు వచ్చే ప్రతి తలంపు చూస్తూ ఉంటాడు ఆయన. ఒక గురువుగారు ఇద్దరు శిష్యులకి చెరొక పండు ఇచ్చి ఎవరూ లేకుండా చూసి తిని వచ్చేయమన్నారు. ఎవరూ చూడకూడదు అని చెప్పారు. ఒక శిష్యుడు వెళ్ళాడు తిని వచ్చేశాడు. ఏవండీ తిని వచ్చేశాను అన్నాడు. ఇంకొకడు ఏమి చేసాడు అంటే ఒక అరగంట చూసాడు, అరటిపండు తినలేక తెచ్చేశాడు. ఏవయ్యా నువ్వు తెచ్చేశావేంటి అన్నారు గురువుగారు. ఎవరూ లేని చోట కూడా ఈశ్వరుడు నన్ను చూస్తున్నాడు. ఎవరూ చూడకుండా మీరు తినమన్నారు. ఈశ్వరుడు చూడకుండా, ఈశ్వరుడి కళ్ళలో పడకుండా నేను పని ఎలా చేయగలను? ఈశ్వరుడు చూడని చోటు లేదు కాబట్టి నేను తిరిగి తెచ్చేశాను అన్నాడంట. ఈశ్వరుడికి కళ్ళు అక్కర్లేదు చూడటానికి, పనిచెయ్యటానికి ఈశ్వరుడికి చేతులు అక్కర్లేదు. నడవడానికి ఈశ్వరుడికి కాళ్ళుఅక్కర్లేదు. మనం కళ్ళు చూస్తున్నాయి అనుకుంటాం. అది తప్పు. శవానికి కళ్ళు ఉన్నాయి కదా! మరి ఎందుకు చూడటం లేదు అంటే అక్కడ చూసేవాడు లేడు. మనకు కావలసింది భోగం కాదు, యోగం. మీకు ఎన్నో రూపాయలు ఉన్నాయి. చదువులు ఉన్నాయి. ఉద్యోగాలు ఉన్నాయి. అధికారాలు ఉన్నాయి అనుకోండి. మీకు శాంతి లేదు అనుకోండి ఏమి సుఖపడతారు మీరు. ఉన్నది ఒక్కటే వస్తువు అని భగవాన్ చెబుతున్నారు కదా, అంతా ఆత్మే అంటున్నారు కదా మరి ప్రపంచంగా కనిపిస్తున్నది ఆత్మే. అయితే మీకు ఆత్మ, ప్రపంచంగా కనిపిస్తున్నంత కాలం భయం తప్పదు. నువ్వు వేరు నేను వేరు అనే బేధబుద్ధి ఉన్నంతకాలం దుఃఖంతప్పదు, భయం తప్పదు, ద్వేషం తప్పదు, అసూయ తప్పదు.

అక్రోధం అంటే ఏమిటి? కోపం లేకుండా ఉండటం. కోపం లేకుండా కూర్చొన్నాం కదా మనం అందరం ఇక్కడ. ఎవరైనా మనలని హింస పెడుతున్నారు అనుకోండి అప్పుడు కూడా మాములు స్థితిలో ఉండాలి. కోపం ఒకటి, కామం ఒకటి నిజం కాదు, అవి వికారాలు. అవి నిజాలు కాదు, నిజాలు అయితే ఎక్కడికి పోతాయి. నిజాలు అయితే జ్ఞానికి కూడా పోవడానికి వీల్లేదు. నిజం కాదు అది వికారం. కోపం గనుక సత్యం అయితే అది పోదు. నాకే కోపం వచ్చింది అనుకోండి మళ్ళీ అరగంటకో, గంటకో తగ్గిపోతుంది. మరి నిజం అయితే ఎందుకు తగ్గిపోతుంది అది. ఎదుటి వ్యక్తి నిన్ను పీడిస్తున్నప్పటికి, అనేక కష్టాలకి,

నష్టాలకి నిన్ను గురి చేస్తున్నప్పటికీ, నీ హృదయంలో కోపం పుట్టకుండా ఉండాలి. అప్పుడే నువ్వు అక్రోధస్థితిని పొందినట్టు. పరీక్ష పెట్టటం లేదు కాబట్టి మనం తప్పించుకుంటున్నాం కాని, ఆ తుకారాంను పరిక్షించినట్టే, మీరాబాయిని పరిక్షించినట్టే పరీక్షలు గనుక పెట్టారో మొత్తం అందరూ ఫెయిలే. లోక కారణాల కోసం, మీ స్వార్థం కోసం మీరు వినయం నటించవచ్చు. అది నటన అవుతుంది కాని, నిజం కాదు అంటున్నాడు వాసుదేవస్వామి. అందుచేత మీరు ఏ పని చేస్తున్నారో ఆ పని కాదు ప్రధానం, ఆ పని చేసేటప్పుడు మీ యొక్క దృష్టి ప్రధానం. పని చేసేటప్పుడు మీ సంకల్పం ఎలా ఉందో చూడాలి. మీరు వినయంగా ఉండచ్చు. దేనికోసం మీరు వినయంగా ఉంటున్నారు? మీరు గౌరవంగా ఉండచ్చు. దేనికోసం గౌరవంగా ఉంటున్నారు? మీరు అణిగి మణిగి ఉండచ్చు, దేనికోసం అణిగి మణికి ఉంటున్నారు? ఇదంతా ఈశ్వరుడు చూడలేడా? ఈశ్వరుడి కంటే మీకు గౌరవాలు ఎక్కువా? ఈశ్వరుడి కోసం మీ గౌరవాలు త్యాగం చెయ్యలేరా? మనం గౌరవాల కోసం జీవిస్తున్నామా? ఈశ్వరుడి కోసం జీవిస్తున్నామా? ఎవడైతే ఈశ్వరుడి కోసం జీవిస్తున్నాడో, ఎవడైతే ఈశ్వరుడి కోసం మరణిస్తున్నాడో, వాడికి ఈశ్వరుడు సాక్షాత్కారం అవుతాడు. మొఘలాయి సామ్రాజ్యం వంటి పెద్ద పెద్ద సామ్రాజ్యాలే కొట్టుకుపోయిన ఈ కాలప్రవాహంలో నీ గౌరవం ఎంత? నా గౌరవం ఎంత? నీ అస్తిత్వం ఎంత? నా అస్తిత్వం ఎంత? నీ భాగ్యం ఎంత? నా భాగ్యం ఎంత?

భగవంతుడి మీద మనకు గౌరవం ఉండాలి. అసలు గౌరవం లేకుండా లోపల నుంచి ప్రీతి ఎలా పుడుతుంది? రమణమహర్షి గారి దగ్గర ప్రత్యేకత ఏమిటంటే, చాలా గంభీరంగా ఉంటారు. రామకృష్ణ పరమహంస ఏమి చేస్తాడు అంటే ఒక్కో చురక వేస్తూ ఉంటాడు. ఇద్దరూ జ్ఞానులు అయినప్పటికి ఆయన స్వభావం వేరు, ఈయన స్వభావం వేరు. కేశవ చంద్రసేన్ ఎంత గొప్పవాడు అండి, అన్నారట ఎవరో రామకృష్ణ పరమహంస దగ్గర. నిజమేనయ్యా, చాలా గొప్పవాడే కాని అన్నీ జాగ్రత్తపడి వెళ్ళిపోయాడు అన్నారు. అంటే పెళ్ళానికి ఏమి ఇవ్వాలో అది రాసేసి, పిల్లలకి ఏమి ఇవ్వాలో అది రాసేసి, మనవలకు ఏమి ఇవ్వాలో అన్నీ రాసేసి, దస్తావేజులు రాసేసి, జాగ్రత్త పెట్టేసి బయటకి వెళ్ళాడు అని అర్థం. నిజంగా గొప్పవాడే సామాన్యమానవుడు కంటే ఆయన గొప్పవాడే. అందులో డౌట్ లేదు. అయితే ఆధ్యాత్మికదృష్టిలో అది కూడా తక్కువ స్థాయి. రామకృష్ణ పరమహంస గారి దృష్టిలో, రమణమహర్షి గారి దృష్టిలో ఈ లోకంలో మనం గొప్పవాళ్ళం అనుకున్న వాళ్ళు అందరూ కూడా చంటిపిల్లల తోటి సమానం. చరిత్రలో మనం చదువుకున్న, గొప్పవాళ్ళు కూడా వాళ్ళ దృష్టిలో చంటి పిల్లలతో సమానం. అది వాళ్ళ అంతస్తు. వాళ్ళ స్థాయి అది. ఆధ్యాత్మిక వైభవం అది. ఆ spirituality యొక్క గొప్పతనం, ఆ వైభవం, ఆ అంతస్తు, ఆ ఐశ్వర్యం. అదే

నిజమైన ఐశ్వర్యం. త్యాగం అంటే ఏమిటి? మనం అనుభవిస్తున్నటువంటి భోగాలను విడిచి పెట్టడమే త్యాగం. మనిషి వాడు అనుభవిస్తున్నటువంటి భోగాలను విడిచిపెట్టడమే త్యాగం. మనం ఏమి అనుకుంటున్నాం అంటే ఒక రూపాయి ఇవ్వడం త్యాగం. మంచిదే, కాదు అని కాదు. ఒక వస్తువును ఇవ్వటం అదికాదు త్యాగం. తాను అనుభవిస్తున్నటువంటి విషయసుఖాలను విడిచి పెట్టడమే త్యాగం. సత్యం కోసం మనం ఏమి త్యాగం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాము. ఏదోఒకటి విడిచిపెట్టడం అంటే అందరూ కాకరకాయని విడిచిపెట్టేస్తారు. అదికాదు. ఆత్మను దర్శించడం కోసం, భగవంతుడు చెప్పే మాటలను ఆచరించడం కోసం, భగవంతుడి కోసం ఏదైనా విడిచి పెట్టగల శక్తి మనలో ఉన్నప్పుడే అది త్యాగం.

త్యాగం అంటే గౌతమబుద్ధుడిది. కొంతమంది ఇతరులకు ఏదైనా ఇచ్చి మరల దానిని స్మరిస్తూ ఉంటారు. ఎందుచేత అంటే చేతితోటీ ఇచ్చారు. మనసుతోటి మోస్తున్నారు. అది త్యాగం కాదు. ఈశ్వరుడికి మన మీద ఎప్పుడు ప్రీతి కలుగుతుంది అంటే ఆయనను తెలుసుకోవడానికి అడ్డువచ్చే వాసనలని, సంస్కారాలని, నా యందు నేను జాలి పడకుండా నా వాసనలని నేను త్యాగం చేస్తే అప్పుడు ఈశ్వరుడు నన్ను మోక్షసామ్రాజ్యానికి అధిపతిని చేస్తాడు. మనం పని చేస్తున్నాం, మనం చేసే పని ఈశ్వరుడి వైపుకి తీసుకువెళుతోందా? లేక జన్మపరంపరల వైపుకి తీసుకువెళుతోందా అని మీరు బాగా ఆలోచించాలి. స్వభావ రీత్యా మీకు ఏపని అయితే సహజంగా అబ్బుతుందో, అది మీరు నిష్కామంగా చేయండి మీకు మోక్షం వస్తుంది. డాక్టరు గారు ఉన్నారు. ఆయన ఇంజనీరింగ్ పని చేస్తాను అంటే ఎలాగ?ఆయన స్వభావ రీత్యా వైద్యుడు. అది నిష్కామంగా చేస్తే ఆయన పవిత్రుడు అవుతాడు. రాజులా, బ్రాహ్మణులా అని కాదు. పని చేసేవాడికి దేనియందు వాడికి ప్రీతి ఉందో, దానిని నిష్కామంగా వాడు చేయగలిగితే, ఈశ్వరార్పణంగా వాడు చేయగలిగితే, కృష్ణార్పణంగా వాడు చేయగలిగితే, వాడికి వాసనలు రాలిపోతాయి. మనం పని చేస్తున్నాము, మనం చేస్తున్న పని బంధంలో పడటానికి సహాయం చేస్తోందా? బంధం నుంచి విడుదల అవ్వటానికి మనం చేసే పని సహాయం చేస్తోందా? అని మీరు ఇంటి దగ్గర కూర్చొని ఆలోచన చెయ్యాలి. మనం అందరం పని చేస్తాం, పని చెయ్యకుండా మనిషి ఎలా ఉంటాడు. నేను చేస్తున్న పని మోక్షం పొందటం కోసం నాకు సహాయం చెయ్యకపోతే ఆ పని వల్ల నాకు ఉపకారం ఏమిటి? రాగద్వేష రహితంగా ఆలోచించాలి అది ఆలోచన అంటే. మనం ఒకటే నేర్చుకోవాలి జీవితంలో, ఎదుటి మనిషి గురించి ఆలోచించేటపుడు కాని, ఎదుటి వస్తువు గురించి ఆలోచించేటప్పుడు కాని రాగద్వేషాలు లేకుండా ఆలోచించాలి. దేశం గురించి ఆలోచించేటప్పుడు కాని, ప్రపంచ పరిస్థితులు గురించి ఆలోచించేటప్పుడు కాని, చివరికి భగవద్గీత చదివేటప్పుడు కూడా రాగద్వేషాలు లేకుండా, చదివితేనే అర్థం

అవుతుంది. ఈ లోకం ఎక్కడ? ఈశ్వరుడు ఎక్కడ? ఇదంతా స్వప్నమే. ఈ బాధ్యతలు అన్నీ స్వప్నం. ఈ సంపదలు అన్నీ స్వప్నం. ఈ గౌరవాలు అన్నీ స్వప్నం. మామూలుగా ఇద్దరు కూలీలు పొలం వెళ్లారు. అందులో ఒకడు పడుకున్నాడు పడుకున్నాక కల వచ్చింది వాడికి, ఏమని కల వచ్చింది? వాడు రాజు అయినట్టు, పరిపాలన చేస్తున్నట్టు, వాడి దగ్గర మంత్రులు, నౌకర్లు ఓ వైభవంగా ఉన్నాడు అన్నమాట వాడు. పక్కన వాడు రాజు గారు వచ్చేస్తున్నారు లెగరా బాబు అంటున్నాడు. రాజు గారు వస్తున్నారు లెగరా, లెగరా అని బలవంతంగా లెగ్గొట్టేసాడు. కల ఇంకా జరుగుతోంది. రాజుగా చేస్తున్నాడు వాడు కలలో. వాడిని బలవంతంగా లెగ్గొట్టేసాడు. చంపేశావురా బాబు నా రాజరికాన్ని తీసేశావు అని వాడి గోల. మరి రాజు గారు వచ్చి తిడతారని నేను లెగ్గొట్టానురా, నీకు ఇంత కల వచ్చిందని నాకు తెలియదు అన్నాడంట వాడు. మన బ్రతుకులు ఇంతే అండి. స్వప్నం నిజం కాదు కదా, వాడు స్వప్నంలో ఎంజాయ్ చేస్తున్న మాట కరక్టే కాని అది నిజం కాదు. ఎప్పటికైనా అది వదులుకోవాల్సిందే, జాగ్రదవస్థలోకి రావాల్సిందే. ఏదైతే నిజం కాదో అది శాశ్వతం కాదు. ఈ స్వప్నం నిజం అయితే శాశ్వతంగా ఉండిపోవాలి. ఈ జాగ్రదవస్థ నిజం అయితే శాశ్వతంగా ఉండిపోవాలి. ఈ శరీరం నిజం అయితే శాశ్వతంగా ఉండిపోవాలి, నా మనసు నిజం అయితే శాశ్వతంగా ఉండిపోవాలి. ఇవాళ ఉన్న మనసు రేపు ఉండదు. రేపు ఉన్న మనసు ఎల్లుండ ఉండదు. అందుచేత ఎదుటివారు నీ గురించి ఏమి అనుకుంటున్నారు అని కాకుండా, నీ గురించి నువ్వు అంచనా కట్టుకుంటూ, కాలం కూడా ఈశ్వర స్వరూపమే కాబట్టి సాధ్యమైనంత వరకూ కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ, భగవంతుడు సంతోషించే పనులు చేస్తూ జీవించండి. నా మాటలు ఇక్కడ విడిచి పెట్టకుండా మీరు ఇంటికి మోసుకు వెళ్లండి. అందులో మంచి మాట ఉంటే తీసుకోండి. భగవంతుడు మిమ్మల్ని చూసి సంతోషించాలి. మీ పట్ల ప్రీతి కలగాలి భగవంతుడికి, మీకు మోక్షం ఎంతసేపు వస్తుంది, జ్ఞానం ఎంతసేపు వస్తుంది? అది భగవంతుడి చేతిలో పనే కదా. మీకు అసాధ్యం ఉండవచ్చు, నాకు అసాధ్యం ఉండవచ్చు. కాని భగవంతునికి అసాధ్యం ఏమిటి? భగవంతునికి ప్రతీది సాధ్యమే. మనకు impossible ఏమో కాని భగవంతుడికి impossible అనేది ఏదీ లేదు. ప్రతీది సాధ్యమే భగవంతుడికి. భగవంతుడి స్వరూపం అంటే ఏమిటి? భగవంతుడి స్వరూపం జ్ఞానమే. అయన స్వరూపాన్ని మనకు ప్రసాదించమని ప్రార్థిస్తున్నాం. అవినయం లేకుండా ఉంటూ, వినయం నేర్చుకుంటూ, అలా జాగ్రత్తగా జీవించాలి. ఏవండీ, లోకంలో మనుషులు అందరూ శుభ్రంగా సినిమాలకి వెళుతున్నారు మమ్మల్ని ఇటువంటి మాటలతో చంపేస్తున్నారు అండి అని మీరు అనుకోవచ్చు. చెట్టు వేసినప్పుడు దానికి నీళ్ళు పోసినప్పుడు కొంచెం బాధ కలుగవచ్చు. కానీ పండు తినేటప్పుడు

తెలుస్తుంది సుఖం విలువ. అలా మోక్షం అనే పండు దొరుకుతుంది మీకు. అది మీకు అనుభవంలోకి వస్తుంది. శాశ్వత శాంతికి, శాశ్వత సుఖానికి, మీరు వారసులు అవుతారు. మీరు చెట్టు వేసినపుడు నీళ్ళు పోస్తున్నారు. అసలు చెట్టు వెయ్యకపోతే నీళ్ళు పోస్తారా ఏమిటి? చెట్టే లేనప్పుడు ఇక నీళ్ళు ఎక్కడ పోస్తాడు వాడు. వాడు ప్రకృతి మనిషి. వాళ్ళ తోటి మీరు పోల్చుకోకండి. భగవంతుడు ఏ పని చెయ్యమని చెపితే అది చెయ్యటం, భగవంతుడు వద్దని చెప్పిన పని మానేయడం. ఆయనను స్మరిస్తూ ఉంటే మనకు తెలియకుండానే మన ప్రయాణం సాగుతుంది. మనకు తెలియకుండా మన వృత్తులు మన స్వాధీనంలోకి వస్తాయి. మన ఇంద్రియాలు అన్నీ మన స్వాధీనంలోకి వస్తాయి. అదే యోగం, అదే భక్తి. మీరు అందరూ మంచి మార్గంలో ఉన్నారు. మీరు ఫలితం కోరుకోక పోయినా ఫలితం వస్తుంది. ఫలితం రావడానికి మీ కోరిక తోటి సంబంధం లేదు. మీరు కోరుకున్నా, కోరుకోకపోయినా ఈశ్వరుడు మీకు ఇచ్చే వాటా మీకు ఇచ్చేస్తాడు. అది మీరు చెప్పక్కరలేదు. అందుచేత మీరు ఏ తలంపు వచ్చినా, ఏ పని చేసినా ఈశ్వరుడి సంతోషం కోసమే తలపెట్టండి. ఈశ్వరుడి రూపాలలో మీకు ఏ రూపం ఇష్టం అయితే ఆ రూపాన్ని ధ్యానం చెయ్యండి. ఆయన నామాన్ని స్మరించండి. ఇప్పుడు మనం ఇక్కడ ఉన్న మాట నిజమే కాని ఇది శాశ్వతం కాదు. ఇది నిత్యం కాదు అనే విషయాన్ని గుర్తుపెట్టుకుంటూ, సాధ్యమైనంత వరకూ రాగద్వేషాలకు అతీతంగా ఉండండి. సత్పురుషులతోటి సహవాసం చేయండి, కనిపించిన ప్రతీ మనిషితోటి స్నేహం చెయ్యకూడదు. చేతికి అందిన ప్రతీ పుస్తకాన్ని చదవకూడదు. ఎండ్రిన్ డబ్బా చేతికి అందుతుందని నోట్లో వేసుకుంటారా మీరు, లేదు కదా! మనకు స్నేహితుడు ఈశ్వరుడు, బంధువు ఈశ్వరుడు, మనకు ఐశ్వర్యం కూడా ఈశ్వరుడే. అన్ని దేహసంబంధాలు ఇక్కడ రాలిపోతాయి. చివరి వరకూ మనలని విడిచి పెట్టని సంబంధం, మనకు జ్ఞానం కలిగే వరకూ మనం చెయ్యి విడిచి పెట్టకుండా ఉండేది ఈశ్వరుడే. మనుషులుని మనం దగా చెయ్యచ్చు. ఈశ్వరుడిని మనం దగా చెయ్యలేము. శాశ్వత సంబంధం మనకు ఈశ్వరుడి తోటే. మీలే ఏవైనా బలహీనతలు ఉంటే, స్వామి ఈ బలహీనతలని మా లోంచి తీసేయ్. నాలో ఈ బలహీనత కనిపిస్తోంది. నాలో ఈ ద్వేషం కనిపిస్తోంది. స్వామి నీ పాదాలకు నమస్కరిస్తున్నాను. నీ పాదాల దగ్గరకు చేరుకోవడానికి నాకు ఈ దోషాలు అడ్డు వస్తున్నాయి. ఈ బలహీనతలు అడ్డు వస్తున్నాయి కాబట్టి నువ్వు నా యందు దయ ఉంచి, కరుణ ఉంచి దోషాలను నా నుంచి తీసేయ్ అని ఈశ్వరుడిని ప్రార్థించుకోవాలి. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే ఈశ్వరుడు మీకు పరమసుఖం ప్రసాదిస్తాడు.

**రమణ సత్యం, రమణ శివం, రమణ సుందరం**



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

**న కర్తృత్వం నకర్మాణి లోకస్య సృజతి ప్రభు।**

**న కర్మఫల సంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ 5-14 ॥**

తాత్పర్యము: పరమేశ్వరుడు మానవుల యొక్క కర్తృత్వమును గాని, వారి కర్మలను గాని, కర్మఫల సంయోగమును గాని సృజింపడు. ఈ యన్నింటిలో ప్రకృతియే ప్రవర్తిల్లును.

ఇది చాలా మంచి శ్లోకం అన్నారు నాన్నగారు. ఇదంతా దేవుడు చేసాడు అని ప్రతిదానికీ మీరు అనుకొంటున్నారు. మీకు కర్తృత్వం, నేను చేసాను అనే భావన, మీ స్వభావం వల్ల, ప్రకృతి వల్ల, వస్తోంది కాని నేను కల్పించలేదు. కర్తృత్వం నేను కల్పించలేదు, మీ స్వభావాన్ని బట్టి, మీ ప్రవృత్తిని బట్టి అది మీకు వస్తోంది. మీ స్వభావాన్ని బట్టి మీరు పని చేస్తున్నారు కాని భగవంతుడు ఈ పని చెయ్యి అని నీకు చెప్పటం లేదు. ఇది భగవంతుడికి సంబంధం లేదు. ఎవరి స్వభావాన్ని బట్టి వాళ్ళు పని చేస్తున్నారు.ఎవరి అలవాట్లని బట్టి వాసనని బట్టి,వాళ్ళు రకరకాల కర్మలు చేసుకొంటున్నారు. అలవాట్లని బట్టే స్వబావం ఏర్పడుతుంది. ఈ పని నేను చేసాను అనే పొగరుబోతుతనం కూడా నేను నీకు కల్పించలేదు. లోకంలో కర్తృత్వాలు కాని కర్మలు కాని నేను కల్పించటం లేదు. ఇదంతా ప్రకృతి చేసుకొని వెళ్ళిపోతోంది, మీ స్వభావం చేసుకెళ్ళిపోతోంది. కర్మ ఫలితాన్ని ఎంజాయ్ చెయ్యమని, భోగించమని,కూడా నేను చెప్పటం లేదు. అది నీ స్వభావాన్ని బట్టి చేసుకుపోతున్నావు. ఎంజాయ్ చేస్తే వాసన పడుతుంది.ఇదంతా నీ స్వభావాన్ని బట్టి జరిగిపోతోంది, ఇందులో

నా ప్రమేయం ఏమీ లేదు. అందుచేత నీ స్వభావాన్ని మార్చుకోవాలి, నీ అలవాట్ల యొక్క వేగాన్ని మార్చుకోవాలి.

స్వభావాన్ని ఎందుకు మార్చుకోవాలి? మంచి కర్మలు ఎందుకు చెయ్యాలి, చెడ్డ కర్మలు ఎందుకు చెయ్యకూడదు? మనోనిగ్రహం ఎందుకు? అంటే భగవంతుడిని పొందటం కోసం ఈ నియమాలు అవసరం. ఈ నియమాలు లేకుండా, క్రమశిక్షణ లేకుండా, నియమబద్ధమైన జీవితం లేకుండా నువ్వు భగవంతుడిని పొందలేవు.

నీ ఆహంభావన నేను కల్పించలేదు.నువ్వు ఏ పని చేస్తే దాని తాలూకు ఫలితం వస్తుంది. కర్మ చేస్తే ఫలితం వస్తుంది, కాని నేనేమీ కల్పించటం లేదు.ఫలానా పని చెయ్యమని కూడా నీకు నేనేమీ చెప్పటం లేదు. ఇదంతా నీ స్వభావాన్ని బట్టి, నీ పూర్వజన్మ వాసనలని బట్టి, పూర్వజన్మ సంస్కారాలని బట్టి, నువ్వు చేసుకుపోతున్నావు. ఇవన్నీ నువ్వు కల్పించుకున్నవే, ప్రకృతి కల్పించినవే, నాకేమీ సంబంధం లేదు అంటున్నాడు పరమాత్మ.


**న కర్తృత్వం నకర్మాణి లోకస్య సృజతి ప్రభు ।**

నామ రూపాలు మాత్రమే మాయ కాదు. ఈ కర్తృత్వం,కర్మలు, చావులు పుట్టుకలు, పుణ్యపాపాలు అనుభవించటం, కర్మఫల సంయోగాలు, ఇవన్నీ మాయ అని చెపుతున్నాడు ఈశ్వరుడు. నీ అజ్ఞానం వల్ల కర్తృత్వం కల్పించుకొంటున్నావు. ఇదంతా నీ అహంభావన నీ వ్యక్తీభావనే కల్పిస్తోంది.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహాత్మ్యం
# అక్షరమణమాల

**తేటివలెను నీవు వికసింప లేదని**

**ఎదుట నిలుతువేల అరుణాచలా!**

తాత్పర్యం : మొగ్గను వికసింప చేయు శక్తి తేనెటీగకు లేదు కాబట్టి, మొగ్గ పువ్వుగా వికసించే వరకూ అది నిరీక్షిస్తూ ఉంటుంది. మరి నీవు తేనెటీగలాగ శక్తి హీనుడవు కాదు కదా? ఒకవేళ నేను పక్వానికి రాకపోతే నన్ను పక్వం చేయుట మాని, అలా తేనెటీగలాగ ఎదురుగా నిలిచి చూస్తున్నావేమిటి అరుణాచలా!

తేనెటీగ పద్మం తెరుచుకున్నప్పుడే తేనె తీసుకోవటానికి వెళ్తుంది. ఆ పుష్పం ఓపెన్ అవ్వకపోతే, అది అక్కడే తిరుగుతా ఉంటుంది కాని లోపలికి వెళ్ళదు. నువ్వు కూడా అలాగ చేస్తావా అరుణాచలేశ్వరుడా! ఈ రమణమహర్షి అనే భక్తుడు ఇంకా వికసించలేదు, ఇంకా పక్వానికి రాలేదు, అందుచేత వాడిలోకి మనం ఎలా ప్రవేశిస్తాము, మన హృదయంలోకి వాడిని ఎలా తీసుకుంటాము అనుకొంటున్నావా? తేనెటీగ అంతే, పువ్వు బాగా వికశిస్తే, లోపలికి వచ్చి తేనె తీసుకొని, శుభ్రంగా భోజనం చేసి బయటికి వెళ్తుంది. నువ్వు తేనెటీగవా! ఆధ్యాత్మికమైన వికాసం నాకు లేదని, భక్తికి సంబందించిన వికాసం నాకు లేదని, తేనెటీగ బయట ఎలా తిరుగుతుందో, అలాగ నాలో ప్రవేశించకుండా దూరం దూరంగా తిరుగుతూ ఉంటావా నువ్వు!

తేనెటీగ చేసే పని నేను చెయ్యగలను, అంతకంటే ఎక్కువ పని నేనుచెయ్యలేను అంటే నువ్వు దేవుడవు అవుతావా అరుణాచలేశ్వరుడా! పువ్వుని వికశింప చేసే శక్తి సూర్యుడికి ఉంది కాని తేనెటీగకు లేదు. ఓ అరుణాచలేశ్వరుడా, నువ్వు తేనెటీగలా ఉండకు. నా హృదయంలో నువ్వు ప్రవేశించాలంటే, నా హృదయం ఓపెన్ అవ్వాలి. నా హృదయం ఓపెన్

అయ్యేటట్టు కూడా నువ్వే చెయ్యి. నేను డిజర్వ్ కాకపోతే, డిజర్వ్ అయ్యేటట్టు నువ్వు చెయ్యి. ఏవిధంగా అయితే డిజర్వ్ అవుతానో ఆలోచించి, ఆరకంగా డిజర్వ్ అయ్యేటట్టు చెయ్యి. నువ్వు నన్ను వికసించేటట్టు చేసి, అప్పుడు నీలో నన్ను ఐక్యం చేసుకో. ఓ అరుణాచలేశ్వరుడా, నీలోకి నన్ను తీసుకో.

ఒక డాక్టరు దగ్గరికి పేషెంట్ వెళితే, రోగం ఉందని పొమ్మంటాడా, ఆ రోగానికి వైద్యం చేసి తగ్గించిపంపుతాడా? రోగం ఉందని బయటికి పొమ్మంటే, హాస్పిటల్ ఎందుకు ఇంక? ఓ అరుణాచలేశ్వరుడా, నేను దేవుడినని, నేను ఈశ్వరుడినని ఒక కిరీటం పెట్టుకున్నావు. నన్ను రక్షించక పోతే నన్ను బాగు చెయ్యక పోతే, నా హృదయాన్ని వికసింప చెయ్యలేకపోతే, నన్ను ఎవాల్వ్ చెయ్యలేకపోతే, నీకు దేవుడు అనే డిగ్రీ ఎందుకు, నీకు ఆ కిరీటం ఎందుకు? నా ముఖంలో ఏముందో అద్దం చూపిస్తోంది, నువ్వు చెప్పాలా నాలో ఉన్న బలహీనతలు? అద్దంచేసే పని నువ్వు చేస్తావా? అద్దంచేసే పనే నువ్వు చేస్తే నువ్వు దేవుడవు అవుతావా? అద్దంచేసే పని చెయ్యవద్దు నువ్వు, అమ్మ చేసే పని చెయ్యి! అమ్మ ఏవిధంగా అయితే తన బిడ్డకు ఉపకారం చేస్తుందో, అదేవిధంగా నాలో ఏమైనా లోపాలు ఉంటే, లోపాలు ఉన్నాయని ఆక్షేపించకు, ఎగతాళిచేయకు. నాలోఉన్న లోపాలు తీసేయి. నేను నీ అంతటి వాడిని అవ్వటానికి, ఎటువంటి సుగుణాలు ఇస్తే నీ అంతటి వాడిని అవుతానో, అటువంటి సుగుణాలు నాకు ఇయ్యి అరుణాచలేశ్వరుడా!

నాలో ఏవో బలహీనతలు ఉన్నాయని, నువ్వు దూరంగా ఉండకుండా, ఆ బలహీనతలను తొలగించి నన్ను బాగుచేసి నన్ను రక్షించు అరుణాచలా! నువ్వు అభివృద్ధిలోకి రాలేదు అని నన్ను విడిచిపెట్టి వేయటం కాదు. నన్ను బాగుచేయటానికి ప్రయత్నం చెయ్యి. అంచేత నువ్వు సంకల్పించాలి. నువ్వు సంకల్పించకపోతే నేను సంకల్పించుకోగలనా! నీ యందు ఇష్టం కలగచేయకపోతే నేను నిన్ను ఇష్టపడ గలనా! నిన్ను తెలుసుకోవాలనే కాంక్ష నా హృదయంలో నువ్వు కలగచేయకపోతే, నీపట్ల నాకు కాంక్ష కలుగుతుందా అరుణాచలేశ్వరుడా! నిన్ను తెలుసుకోవాలనే కాంక్ష ఉంటేనే నువ్వు తెలియబడతావు, ఆ కాంక్ష కూడా నువ్వే కలగచెయ్యి. ఇష్టం లేదని పొమ్మనకు, నీ యందుఇష్టం కలిగేటట్టు చెయ్యి అరుణాచలేశ్వరుడా!

**అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలా!**

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **52010126418572 4**

**UNION BANK OF INDIA, PALAKOL BRANCH**

IFSC Code : **UBIN0916137, Contact No. 9866715896**

# అరుణాచల దీపోత్సవం

కార్తీక మాసం అనగానే రమణభక్తులకు స్ఫురించేది అరుణాచల దీపోత్సవం! సదాశివుడు బ్రహ్మ, విష్ణువులకు జ్యోతిస్వరూపంగా దర్శనం ఇచ్చిన రోజు మరియు సకల జీవుల హృదయాలలో అంతర్యామిగా ఉన్న పరంజ్యోతికి చిహ్నంగా అరుణగిరి శిఖరం మీద జ్యోతిని వెలిగిస్తారు. బాహ్యమైన దీపాన్ని వెలిగించడం, హృదయంలో స్వరూపంగా ఉన్న జ్ఞానజ్యోతికి సంకేతంగా భావించాలి. సద్గురువు శ్రీనాన్నగారితో మనము అనేక దీపోత్సవాలు అరుణాచలంలో జరుపుకున్నాం! వాటి మధుర జ్ఞాపకాలు మాటలలో వర్ణించడం కష్టమే! సూర్యుని ముందు చీకటి నిలవనట్లు 'జ్ఞానజ్యోతి' ముందు అజ్ఞానం నిలవదు. అరుణగిరికి ఒక పేరు ఉంది 'చంపక చంపెడు మందు' అని. అనగా శరీరాన్ని చంపకుండా, అహంకారాన్ని చంపేస్తుంది. అరుణాచలం ఎందుకు వచ్చిందో? అది చేసే పని ఏమిటో? అక్షరమణమాలలో భగవాన్ శ్రీరమణమహర్షి మనకు ప్రసాదించిన 'అరుణాచలమనుచు స్మరియించువారల అహము నిర్మూలింతువు అరుణాచలా!" అనే సారమైన ద్విపదను పదే పదే సద్గురు శ్రీనాన్నగారు ప్రస్తావించేవారు. ప్రతి క్షేత్రానికి ఒక ప్రత్యేకత ఉంటుంది, అరుణాచలమునకు అహంకారం నిర్మూలించే కొండగా పేరు. అజ్ఞానమనే చీకటిని తరిమివేసి జ్ఞానజ్యోతిని నింపే క్షేత్రం. సదాశివుడు బ్రహ్మ, విష్ణువుల కలహాన్ని తీర్చి అనుగ్రహించాడు. ఆ 'అనుగ్రహమే' గిరి రూపు దాల్చింది. దేవతలకు, మానవులకు ఆరాధ్యమైంది అదే అరుణాచలం! అరుణగిరి మన మాంసనేత్రాలకే శిలాకారంగాని, అసలు జ్యోతిస్వరూపమే అనేవారు భగవాన్. శ్రీరమణుడు సాక్షాత్తు నడియాడిన అరుణాచలేశ్వరుడే! అరుణాచలమును తనకు అన్యముగా ఎప్పడు భావించి ఎరుగరు భగవాన్! కార్తీక దీపోత్సవాన్ని చూచినప్పడు, నా శరీరము పులకించి, ఆనంద భాష్పాలు పొంగి పొరలుతాయి అని చెప్పి మౌనము వహించేవారు భగవాన్. అట్టి అరుణాచలముతో మరియు భగవాన్ శ్రీరమణమహర్షితో సద్గురువు శ్రీనాన్నగారికి ఉన్న జన్మాంతర సంబంధం, వారి తన్మయత్వం, మన మాటలకు, వర్ణనకు అందదు. అట్టి సద్గురువు శ్రీనాన్నగారితో మనకున్న సంబంధం అనేక జన్మల పుణ్య ఫలమే.

**ఓం తత్ సత్**

**(ది॥ 29-11-2020 అరుణాచల దీపోత్సవం సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# బాపు మహాత్ముడు కాబట్టే - ప్రపంచాన్ని ఆకర్షించారు

కర్మ మార్గమునకు ప్రతీక బాపూజీ. పనులు చేస్తూ ఉండు ఫలితాన్ని ఆశించకు ఇదే నిష్కామకర్మయోగం. భగవత్ గీతకు ఇదే పునాది. బాపూ "కర్మ సిద్ధాంతంలో నాకు అచెంచలమైన విశ్వాసం ఉంది, కానీ పురుష ప్రయత్నంలో కూడా నమ్మకముంది. నిష్కామకర్మలోనే మోక్షం సాధ్యమని నా నమ్మకము. సత్యం భగవంతుడు అని నాకు తెలుసు. ఆయన దర్శనం లభించాలంటే నాకు ఉన్న పట్టుకొమ్మలు రెండే. అవి ప్రేమ - అహింస. దైవేచ్ఛననుసరించి ప్రపంచంలో ప్రతీదీ జరుగుతూ ఉంటుంది. మనం కేవలం భగవానుని సాధనములు వంటి వారము. మనకు సహాయపడేది ఏదో, పడనిది ఏదో తెలుసుకొని మనం తృప్తిపడాలి. సాధన మంచిదైతే సిద్ధికి మనం భయపడనక్కరలేదు. సిద్ధి దైవం (గురువు) చూచుకుంటాడు. సంకల్పమే శీలమును నిశ్చయిస్తుంది. వాస్తవంగా మానవుడే తన అదృష్టమునకు కారకుడు. బాధానుభవం లేనిదే పుణ్యకర్మ అసంభము. విత్తనం యొక్క రూపు మారనిదే చెట్టు మొలవదు. కష్టపడనిదే సుఖం దొరకదు. నా జీవితంలో ఆశ్చర్యం గొలిపే పనులన్నీ కార్యాకారణాలు ఊహించి చేయలేదు. సహజజ్ఞానం ప్రేరేపిస్తేనే చేసాను. 1930 సం॥ దండి సత్యాగ్రహం గురించి నేను ఏమీ చెప్పలేకపోయాను. అందరూ వ్యతిరేకించారు అదో మెరుపు మెరిసినట్లు మెరిసింది. అదే దేశాన్ని ఒక ఊపు ఊపి వదిలిపెట్టింది. ఆధ్యాత్మిక విద్య గురించి ఒక్కమాటలో చెబుతాను 'ఈ విద్య పుస్తకాలు పఠిస్తే రాదు. గురుముఖతా రావాలి అని హిందూమతం ప్రభోదిస్తున్నది దానిలో గట్టి నమ్మకం నాకు ఉంది'. ఈశావాస్యా ఉపనిషత్తులో 'ఈ సృష్టి అంతా భగవంతునితో ఆశ్ఛాదితమై ఉన్నది'. ఆ ఒక్క మంత్రం మన మదిలో ఉంటే హిందూమతం నిలిచి ఉంటుంది, దాన్ని ఆచరించకపోతే అది నిరుపయోగము. తుదకు మోసగాడు తనను తానే మోసగించుకుంటాడు. బాపూ ప్రవచనాల్లో క్లారిటీ ఉంటుంది. అస్పష్టత కానరాదు. బాపూజీ గురించి తెలుసుకోవాలంటే 'నా జీవితమే, నా సందేశం' అనే పుస్తకం చదివి తీరాలి. బాపూ 'నెపోలియన్ తుదకు ఖైదీగా బంధించబడ్డాడు, కెయిజర్ ఐరోపా ఖండాన్ని పాలించి సామాన్య పౌరుడిగా దిగజారాడు. ఇవి చింతించి మన వినయం - విధేయతలు నేర్చుకోవాలి. సమత్వమే జ్ఞానం అన్న దానికి నిదర్శనంగా జరిగిన సంఘటనలు సేవాగ్రామ్ ఆశ్రమంలో భారత్ - పాకిస్థాన్‌లకు స్వాతంత్ర్యం ఇచ్చే సమయంలో మేధావుల సమావేశంలో చర్చ జరుగుతోంది ఎలా ఉంటుందో అని ప్రపంచం ఎదురుచూస్తున్నారు - గాంధీజీ కిటికీ వద్దకు 6 సం॥ల వయస్సు ఉన్న బాలిక 'బాపూ ఈరోజు నాతో షికారుకు వస్తావా?' అంటే సమావేశాన్ని ఆపి ఆమెతో 'అమ్మా ఏమీ అనుకోకు ముఖ్య విషయంలో ఉన్నాను రేపు వస్తాను' అన్నారు. ఇలా ఎన్నో ఎన్నో ఒక విలేఖరి 'స్వాతంత్ర్యం తీసుకొచ్చి మీరు ప్రధాని కాకుండా నెహ్రూకు ఇయ్యుటమేమిటి?' అని అడుగగా ప్రక్కనే ఉన్న ఒక పెద్దాయన 'ప్రధాని పదవి అనే కుర్చీ ఆయనకు చాలదు. ఆయన యూనివర్సల్' అన్నారు. బాపూ దేహం వదిలిన తరువాత ప్రపంచవ్యాప్తంగా ఆయన విగ్రహాలు, ఊరి పేర్లు వెలసాయి. గాంధీజీ గురించి ఐన్‌స్టీన్ 'రక్తమాంసాలతో కూడిన ఇలాంటి వ్యక్తి ఒకరు ఈ భూమిమీద తిరుగాడాడంటే భావితరాలవారు అంత సులభంగా విశ్వసించరు' అన్నారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**